

మాట ప్రకారం మామిడి సబ్సిడీ జమ!



చిత్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల విషయంలో సీఎం చంద్రబాబు మాట నిలబెట్టుకున్నారు. సీజన్ ప్రారంభంలో ఇచ్చిన మాట ప్రకారం కిలోకు రూ.4 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశారు. చిత్తూరు జిల్లాలోనే రూ.146.84 కోట్ల సొమ్ము 31,929 మంది రైతుల బ్యాంకు ఖాతాల్లో మంగళవారం జమైంది.ఈసారి సీజన్‌లో తోతాపురి మామిడి దిగుబడి విపరీతంగా రావడం, రెండేళ్ల కిందటి గుజ్జు టన్నుల కొద్దీ జ్యూస్ ఫ్యాక్టరీల్లో అలాగే ఉండిపోవడం వంటి కారణాలతో ఈసారి రైతులకు గిట్టుబాటు ధర దక్కలేదు.దీంతో సీఎం చంద్రబాబు రైతుల నుంచి గ్రీవెన్స్ వెళ్లకముందే సీజన్ ప్రారంభంలోనే కిలోకు రూ.4 సబ్సిడీ ధర ప్రకటించారు.చిత్తూరు జిల్లాలో రూ.147 కోట్లు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలు కలుపుకొంటే రూ.187 కోట్ల సబ్సిడీని తాజాగా విడుదల చేశారు. 2018లో కూడా రైతులు ఇదే తరహాలో సంక్షోభాన్ని ఎదుర్కొంటే అప్పుడు కూడా సీఎంగా ఉన్న చంద్రబాబు కిలోకు రూ.2.50 చొప్పున సబ్సిడీ అందించిన విషయాన్ని రైతులు గుర్తు చేసుకుంటున్నారు.

పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే

పొరుగు రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటకల్లోనూ ఈసారి బంపర్ క్రాప్ వచ్చింది. ఈ రెండు రాష్ట్రాల్లో ఫ్యాక్టరీలు కిలోకు రూ.4 నుంచి రూ.4.50 మధ్యలో కొన్నాయి. మన వద్ద రూ.6 నుంచి రూ.7 వరకు ఇవ్వగా, సీజన్ ముగిసే సమయంలో రూ.8 కూడా ఇచ్చాయి. మన ప్రభుత్వం కిలోకు రూ.4 సబ్సిడీ సీజన్ ప్రారంభంలోనే ప్రకటించగా, కర్ణాటకలో మాత్రం అక్కడి కేంద్ర మంత్రి కుమారస్వామి లేఖ మేరకు కేంద్రం రూ.4 సబ్సిడీని ప్రకటించింది. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటా వేసుకున్నాయి. అందులోనూ ఒక్కో రైతుకు రూ.40 వేలు గరిష్ఠ సాయమనే ఆంక్షల్ని విధించారు. తమిళనాడు రైతులకు అయితే ఏ సాయం అందలేదు. సీఎం చంద్రబాబు లేఖ మేరకు సీజన్ ముగిశాక కేంద్రం కిలోకు రూ.1.86 ఇచ్చేందుకు అంగీకరించింది.

వైసీపీ హయాంలో అందని సబ్సిడీ

వైసీపీ పాలనలో మామిడి రైతులకు నయా పైసా సబ్సిడీ ఇవ్వలేదు. 2019లో అకాల వర్షాలతో మామిడికి వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు.2020, 2021 సంవత్సరాల్లో కరోనా కారణంగా ఎగుమతుల్లేవు. 2022లో దిగుబడి లేదు. 2023లో దిగుబడి బాగా వచ్చినా ఫ్యాక్టరీలు సిండికేట్‌గా మారి కనీస మద్దతు ధర ఇవ్వలేదు. రైతులతో కలిసి ప్రతిపక్షాలు, రైతు సంఘ నాయకులు ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు.

ఆలస్యానికి కారణం..

జూన్, జూలై నెలల్లో సీజన్ ఉండగా, ఆగస్టులో సిబ్బంది నమోదు చేసుకున్న జాబితాలు సరిపోలేదని మరోసారి రైతు సేవా కేంద్రాల్లో వెరిఫై చేశారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోని రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు రావు. దీంతో అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు రీవెరిఫికేషన్‌తో పాటు ఈ క్రాప్ బుకింగ్ కూడా చేయాల్సి వచ్చింది. ఆ మొత్తం జాబితాను మళ్లీ ఆన్‌లైన్ చేశారు. ఇదంతా చేసేందుకు నెలకుపైగా సమయం పట్టింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీని ముందే విడుదల చేసినా, రైతుల ఖాతాల్లో జమ చేయడం ఆలస్యమైంది.

సవాలుగా తీసుకున్న కలెక్టర్, యంత్రాంగం

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ఇచ్చే విషయంలో జిల్లా అధికార యంత్రాంగం పకడ్బందీగా వ్యవహరించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాలతో గుజ్జు ఫ్యాక్టరీలు, ర్యాంపుల వద్ద షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించి రైతుల వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రారంభంలో పొరుగు రాష్ట్రాల కాయలు రాకుండా చెక్‌పోస్టుల వద్ద కట్టడి చేశారు. కలెక్టర్‌తో పాటు జేసీ విద్యాధరి, హార్టికల్చర్ డీడీ మధుసూదన రెడ్డి, ఆర్డీవోలు, తహసీల్దార్లు రైతుల సమస్యల్ని పరిష్కరించేందుకు రెండు నెలలు క్షేత్రస్థాయిలో పర్యటించారు.ఆగస్టులో రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల్లో పరిశీలించి ఆన్‌లైన్ చేశారు. మంగళవారం రైతులకు సబ్సిడీ జమయ్యేవరకు అదేపనిలో ఉన్నారు.

పూతలపట్టు నియోజకవర్గంలోనే ఎక్కువ

రైతులకు విడుదల చేసిన సబ్సిడీని పరిశీలిస్తే మామిడి సాగు అధికంగా ఉన్న పూతలపట్టు నియోజకవర్గానికి అధికంగా వచ్చింది. బంగారుపాళ్యంలో 5277 మంది రైతులకు రూ.25.11 కోట్లు, తవణంపల్లెలో 3204 మందికి రూ.14.63 కోట్లు, ఐరాలలో 3241 మందికి రూ.14.25 కోట్లు, పూతలపట్టులో 2396 మందికి రూ.11.48 కోట్లు, యాదమరిలో 1797 మందికి రూ.8.19 కోట్లను జమ చేశారు.తక్కువగా గుడుపల్లె మండలంలోని 9 మందికి రూ.3.30 లక్షలు మంజూరు చేశారు. ఆ తర్వాత పుంగనూరు, నిండ్ర మండలాల్లో వరుసగా 24, 28 మందికి రూ.10 లక్షలు, రూ.20.90 లక్షలు చొప్పున ఇచ్చారు.

2018లో ఓసారి, ఇప్పుడు మరోసారి

తోతాపురి రైతులను ఆదుకుంది రెండుసార్లూ చంద్రబాబు పాలనలోనే

రూ.146.84 కోట్ల సబ్సిడీ జమ చేశాం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మామిడి రైతుల ఖాతాల్లో కిలోకు రూ.4 చొప్పున రూ.146.84 కోట్ల సబ్సిడీ సొమ్మును జమ చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 31,929 మంది రైతుల నుంచి 3.67 లక్షల మెట్రిక్ టన్నుల మామిడిని కొనుగోలు చేశామన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసుకోని రైతులు, నేరుగా ట్రేడర్స్‌కు మామిడి అమ్మిన రైతులకు సబ్సిడీ జమ కాలేదన్నారు. అలాంటి వారు ఈ నెలాఖరులోగా రైతు సేవా కేంద్రాలు, మండల హార్టికల్చర్ ఆఫీసుల్లో వినతిపత్రాలు అందించాలని కోరారు. అర్హతను 48 గంటల్లో నిర్ధారించి జాబితా సిద్ధం చేస్తామన్నారు. ఇదివరకే అర్హత పొంది బ్యాంకుల్లో డబ్బులు పడనివారు కూడా అర్జీలు ఇవ్వొచ్చన్నారు.



కలెక్టర్ సుమిత్‌కుమార్

21 మంది రైతులకు రూ.5 లక్షలకు మించి సబ్సిడీ అందనున్న నేపథ్యంలో, వీరి అర్హతను మరోసారి పరిశీలించనున్నట్లు తెలిపారు.

మూడు ఫ్యాక్టరీలకు ప్రోత్సాహకాల నిలిపివేత

ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు మద్దతు ధర ఇవ్వని మూడు మామిడి పల్ప్ ఫ్యాక్టరీలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని రకాల ప్రోత్సాహకాలను నిలిపివేస్తున్నట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గుడిపాల, పుంగనూరు, బంగారుపాళ్యం మండలాల్లోని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ప్రభుత్వ ఆదేశాలను పట్టించుకోలేదన్నారు. ఏపీఐఐసీ ద్వారా కూడా చర్యలు తీసుకుంటామని వివరించారు. కార్యక్రమంలో హార్టికల్చర్ డీడీ మధుసూదన రెడ్డి పాల్గొన్నారు.



దీపావళి గిఫ్ట్

సబ్సిడీ మంజూరు చేసి సీఎం చంద్రబాబు మామిడి రైతులకు దీపావళి గిఫ్ట్ అందించారు. గిట్టుబాటు ధర లేదని కంటతడి పెట్టిన రైతులను ఆదుకున్నారు. 6 టన్నుల తోతాపురి కాయలు ఫ్యాక్టరీకి సరఫరా చేశా.సబ్సిడీ అందించి ఆదుకున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

- సుధాకరరాజు, కోసలనగరం, విజయపురం మండలం



రైతుల మేలు కోరే ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం రైతుల మేలు కోరేదని మరోసారి రుజువైంది.మామిడి రైతులకు సబ్సిడీతో కొంత ఊరట లభించింది. మామిడి రైతులంతా ముఖ్యమంత్రి చంద్రబాబుకు రుణపడి వుంటారు.

- అయిరాల రాజేష్‌రెడ్డి,ఆత్మ మాజీ ఛైర్మన్,ఐరాల మండలం

బంగారు పురుగు



రామకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో మంగళవారం బంగారు రంగులో కన్పించిన ఓ పురుగు స్థానికుల్ని ఆశ్చరానికి గురిచేసింది. రామనగర్ కాలనీలో నివాసం ఉంటున్న మాజీ ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణశెట్టి పెరటి తోటలోని దొండకాయ చెట్టు ఆకులో ఇది కన్పించింది. దొండచెట్టుకు ఏదో కాయ కాసిందనుకున్న వారు దానిని తాకి చూడగా కదలడంతో ఆశ్చర్యపోయారు.

టెంకాయ ఆపిల్



బైరెడ్డిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కొబ్బరికాయ ఆకారంలో ఉన్న ఈ ఆపిల్ చూపరులను ఆకర్షిస్తోంది. బైరెడ్డిపల్లెకు చెందిన పురోహితుడు మురళీధరాచార్యులు ఓ శుభకార్యానికి వెళ్లగా ఆయనకు అందజేసిన పండ్లలో ఈ ఆపిల్ వుంది.



గంగన్న శిరస్సు జలపాతం

పలమనేరు పట్టణ దాహార్తి తీర్చేందుకు పదేళ్ల క్రితం కౌండిన్య నదిపై కాలువపల్లె వద్ద ఓ జలాశయం నిర్మించారు. అయితే ఈ జలాశయానికి ఏడాదిపాటు మాత్రమే ప్రజలకు తాగునీరందించే సామర్థ్యం వుంది.ఏ సంవత్సరమైనా వర్షాలు సరిగ్గా కురవక నది ప్రవహించక పోతే ఆ ఏడాది తాగునీటి ఎద్దడి తప్పదు. దీనికి 5 కిలోమీటర్ల దూరంలోని గంగన్న శిరస్సు జలపాతం వద్ద ఒక రిజర్వాయర్ నిర్మించి, దాంట్లోనుంచి కౌండిన్య రిజర్వాయర్‌కు నీటిని పంపింగ్ చేయడమొక్కటే ఈ సమస్యకు పరిష్కార మార్గమని కొన్నేళ్లుగా నాయకులు చెబుతున్నారు.ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన భూమిని రైతుల నుంచి సేకరించి ఏళ్లు గడిచిపోతున్నాయి.అయినా రిజర్వాయర్ పనులు ఎప్పుడు జరుగుతాయో ఎవరూ చెప్పలేకపోతున్నారు.

పుష్కలంగా నీరున్నా వినియోగమేదీ?

ప్రాజెక్టులు కట్టకపోవడంతో తమిళనాడుకు తరలిపోతున్న కౌండిన్య, కైగల్ జలాలు

7లో

సిట్.. సీఐడీ

మద్యం స్కాంపై పెద్దిరెడ్డి ఇంట్లో తనిఖీలు

పరకామణి కేసులో ఫైళ్ల సీజ్

లిక్కర్ స్కామ్ కేసులో సిట్.. శ్రీవారి పరకామణి కేసుపై సీఐడీ అధికారులు ఒకే రోజు తిరుపతిలో తమ కార్యకలాపాలు చేపట్టారు. రెండు కీలక కేసులపై.. రెండు విభాగాల అధికారుల తనిఖీలు, ఫైళ్ల సీజ్‌తో కలకలం రేగింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

వైసీపీ హయాంలో నాసిరకం మద్యం.. అధిక ధరలకు అమ్మడంపై కూటమి ప్రభుత్వం 'సిట్'ను ఏర్పాటు చేసి విచారణ చేపట్టింది. ఈ లిక్కర్ కేసులో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిని ప్రధాన నిందితుడిగా పేర్కొన్నారు ఈయన బెయిల్‌పై బయటకు వచ్చారు. ఇదే కేసులో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి జైలులో ఉండగా.. ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డినీ మరో నిందితుడిగా సిట్ అధికారులు చేర్చారు. ఇటీవల పుత్తూరులోని నివాసంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామిని సిట్ అధికారులు విచారించారు. తాజాగా మంగళవారం హైదరాబాదు, బెంగళూరుతో పాటు తిరుపతి నగరం మారుతీనగర్‌లోని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఇంట్లో సిట్ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో మిథున్‌రెడ్డి లేరని.. ఆయన తండ్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రం ఉన్నారని తెలిసింది. పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన పీఎల్ఆర్ నిర్మాణ సంస్థ ఖాతాలకు లిక్కర్ స్కామ్‌కు సంబంధించిన నిధులు మళ్లించారనే ఆరోపణల నేపథ్యంలో.. ఆ సంస్థకు డైరెక్టర్‌గా ఉన్న పెద్దిరెడ్డి సతీమణి స్వర్ణలతను సిట్ అధికారులు ప్రశ్నించారు. ఆ నిధులు ఎక్కడివి? ఎలా వచ్చాయనేది రాబట్టినట్లు తెలిసింది. పెద్దిరెడ్డి ఇంట్లో ఉన్న పీఎల్ఆర్ నిర్మాణ సంస్థ ఉద్యోగుల నుంచీ స్టేట్‌మెంట్లు తీసుకున్నట్టు తెలిసింది. కీలకమైన ఏడు డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఇలా సిట్ అధికారులు విచారణ నిమిత్తం రావడంతో వైసీపీలో కలకలం రేగింది.



పెద్దిరెడ్డి నివాసం నుంచి బయటకు వస్తున్న సిట్ అధికారులు



తిరుపతిలో న్యాయస్థానం నుంచి వస్తున్న సీఐడీ డీజీ రవిశంకర్ తదితరులు

వైసీపీ ప్రభుత్వంలో 2023 ఏప్రిల్ 29న తిరుమల శ్రీవారి ఆలయ పరామణిలో డాలర్లు చోరీ చేస్తూ జియ్యంగార్ మఠం ఉద్యోగి రవికుమార్ పట్టుబడగా.. ఈ కేసును నిబంధనలకు విరుద్ధంగా లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నారు. దీనిపై హైకోర్టులో ప్రజాప్రయోజనాల వ్యాజ్యం దాఖలు కావడంతో విచారించిన హైకోర్టు పరకామణి కేసులో ఏమి జరిగిందో దర్యాప్తు చేసి ఆధారాల సహా నివేదికను సీల్డ్ కవర్‌లో ఈనెల 17న అందజేయాలని ఆదేశించింది. ఈ క్రమంలో సీఐడీ డైరెక్టర్ జనరల్ రవిశంకర్ అయ్యనార్ సోమవారం రాత్రే తిరుపతి చేరుకున్నారు. సీఐడీ లీగల్ అడ్వైజర్ లక్ష్మణరావు, తిరుపతి సీఐడీ అధికారులతో కలసి మంగళవారం ఉదయాన్నే తిరుమలలో దర్యాప్తు, ఆధారాల సేకరణ ముగించుకుని తిరిగి తిరుపతి వచ్చారు. తిరుపతిలో సెకండ్ ఏడీఎం కోర్టు న్యాయాధికారిని కలిశారు. ఈ కేసుకు సంబంధించిన ఫైళ్లు, రికార్డులు కావాలని కోరుతూ మెమో దాఖలు చేశారు. కేసు రాజీకి సంబంధించి లోక్ అదాలత్ రికార్డులూ కావాలని అభ్యర్థించారు. అనంతరం టీటీడీ ఏడీ భవనానికి చేరుకుని ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌తో సమావేశమయ్యారు. 'పరకామణి' కేసుకు సంబంధించి రికార్డులు, చోరీ సమయంలో పనిచేసిన సిబ్బంది వివరాలు, ఇప్పుడు ఎక్కడున్నారనే వివరాలు కావాలని కోరారు. అప్పటి సీసీ కెమెరాల ఫుటేజీ ఇవ్వాలన్నారు. ఇలా ఏడీ భవనంలోనే 5.20 గంటలపాటు ఉన్నారు. తిరుపతి, తిరుమలలో సీజ్ చేసిన రికార్డులను బుధవారం హైకోర్టుకు సమర్పిస్తామని మీడియాకు చెప్పారు. ఇలా 'పరకామణి' కేసుపై సోమవారం హైకోర్టు సీరియస్ కావడం.. మంగళవారమే సీఐడీ అధికారులు వచ్చి రికార్డులు సీజ్ చేయడం.. బుధవారం హైకోర్టుకు సమర్పించనుండటం వంటి పరిణామాలు వేగంగా జరగడంతో సంబంధితుల్లో కలవరం మొదలైంది.

కొత్త టీచర్లకు ఫేషియల్ అటెండెన్స్

చిత్తూరు సెంట్రల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తాజా డీఎస్సీ ద్వారా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎంపికైన 1394 మంది టీచర్లు మెగా డీఎస్సీ ఐడీ పాస్‌వర్డ్‌తో అటెండెన్స్ వేయాల్సి ఉంది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో అపాయింట్మెంట్ పొందిన కొత్త టీచర్లు మండల విద్యాశాఖాధికారి-1కి రిపోర్టు చేశారు. హైస్కూల్లో క్లియర్ వేకెన్సీ క్లస్టర్ వేకెన్సీల్లో వచ్చినటువంటి ఎస్జీటీ ఉపాధ్యాయులు సంబంధిత క్లస్టర్ హెచ్ఎంలకు రిపోర్టు చేశారు. ఎంఈవో ఇచ్చిన జాయినింగ్ రిపోర్టు ద్వారా కొత్త ఉపాధ్యాయులు వారికి కేటాయించిన పాఠశాలల్లో చేరారు.వీరికి ట్రైనింగ్ సందర్భంలో కేటాయించిన ఎండీఎస్సీ ఐడీ, పాస్‌వర్డ్‌లతో తప్పని సరిగా హాజరు వేయాల్సి ఉంది. వీరికి ట్రెజరీ ఐడీలు జనరేట్ చేయబడిన తర్వాత ఇతర రెగ్యులర్ టీచర్ల మాదిరిగానే వీరికి ఐడీలు రాష్ట్రస్థాయిలో మారుస్తారు. ట్రెజరీ ఐడీలు వచ్చే వరకు మెగా డీఎస్సీ ఐడీ,పాస్‌వర్డ్‌తో కొత్త టీచర్లు ఫేషియల్ అటెండెన్స్‌ను నిబంధనల ప్రకారం క్రమం తప్పకుండా ఇన్‌టైం, అవుట్ టైం నమోదు చేయాల్సి ఉంది. ఈ మేరకు డ్రాయింగ్ డిస్బర్స్మెంట్ అధికారులు (డీడీవో) కొత్త టీచర్లకు అటెండెన్స్‌తో పాటు ఇతర విధుల విషయాల్లో సూచనలు ఇవ్వాల్సి ఉంది.

ప్రాణం తీసిన ఇన్సూరెన్స్ సొమ్ము

వృద్ధుడి మృతదేహాన్ని ముక్కలు చేసి చెరువులో పడేసిన వైనం

నగరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇన్సూరెన్స్ నగదు ఓ వృద్ధుడి ప్రాణం తీసింది. మంగళవారం ఈ దారుణం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరి పట్టణ పరిధిలోని కొత్తపేటకు చెందిన గుణశీలన్(65)కు నలుగురు సంతానం. సంగీత, జ్యోతి, వసంత్, విజయ్. వీరిలో విజయ్‌కి కొత్తపేటలోనే గంగాధరం కుమార్తె కౌసల్యతో వివాహం జరిపించారు. అయితే కుటుంబ తగాదాలతో వివాహమైన ఆరు నెలలకే అతను ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటికే భార్య గర్భవతి. ఆమెకు రెండో పెళ్లి చేయాలన్న ఉద్దేశంతో కౌసల్య కుటుంబీకులు గర్భాన్ని తొలగించారు. మరోవైపు విజయ్ అప్పటికే ఇన్సూరెన్స్ పాలసీ వేసి ఉండటంతో రూ.1.25 కోట్లు వచ్చాయి. నామినీగా ఉన్న తండ్రి గుణశీలన్ బ్యాంకు ఖాతాకు జమయ్యాయి. ఈ నగదులో రూ.10లక్షలను మాత్రమే రెండో పెళ్లికి సిద్ధమైందన్న కారణంతో కౌసల్యకు ఇచ్చాడు. తక్కువ నగదు ఇచ్చాడని కౌసల్య తండ్రి గంగాధరం పగపెంచుకున్నాడు. ఈ క్రమంలో గుణశీలన్ దంపతులు తిరుత్తణికి వెళ్లిపోయారు. కొత్తపేటలోని ఇంటిని బుగ్గ అగ్రహారానికి చెందిన అయ్యప్పకు ఇచ్చాడు. మాటల్లో గుణశీలన్ వద్ద డబ్బులున్న విషయాన్ని గ్రహించిన అయ్యప్ప.. అప్పుగా రూ.30 లక్షలు తీసుకున్నాడు. అప్పు తీర్చకపోవడంతో గుణశీలన్ గట్టిగా అడిగాడు. ఈ నేపథ్యంలో జూన్ 24వతేదీ నుంచి గుణశీలన్ కనిపించడం లేదని కుమార్తె సంగీత తిరుత్తణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు భాగంగా అయ్యప్పను విచారించగా హత్య ఉదంతం బయటపడింది. అప్పు అడుగుతున్నాడని, ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వలేదని అయ్యప్పన్, గంగాధరం ఈ హత్య చేసినట్లు తేలింది. పథకం ప్రకారం జూన్ 24వ తేదీ మధ్యాహ్నం గుణశీలన్‌ను నిందితులిద్దరూ నగరిలోని ఇంటికి తీసుకొచ్చారు. తల వెనుకవైపు బలమైన కట్టెతో కొట్టగా అతను మృతిచెందాడు. చీకటిపడ్డాక ఇద్దరూ కలిసి మృతదేహాన్ని గోనె సంచిలో చుట్టుకుని నగరి మండలంలోని ఎం.కొత్తూరు చెరువు కట్టవద్దకు చేరుకున్నారు. అక్కడే మృతదేహాన్ని ముక్కలుచేసి చెరువులో వేసినట్లు నిందితులు తెలపారు. మంగళవారం సాయంత్రం చెరువు వద్దకు నిందితులతోపాటు చేరుకుని గాలింపు చేపట్టారు. చీకటి పడటంతో గాలింపును, పోస్టుమార్టంను బుధవారానికి వాయిదా వేశారు. ఈ విషయం తెలియడంతో సంఘటన స్థలం జనం గుమికూడారు.



గుణశీలన్ (ఫైల్ ఫొటో)



గౌతమ్ సింఘానియా - మధుర్ భండార్కర్ - సావిత్రి బాలసుబ్రహ్మణ్యం

తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. రేమాండ్స్ గ్రూప్ ఛైర్మన్, ఎండీ గౌతమ్ సింఘానియా, బాలీవుడ్ చిత్ర దర్శకుడు, నిర్మాత, రచయిత మధుర్ భండార్కర్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి, ఏపీ ఎన్జీవో ప్రెసిడెంట్ విద్యాసాగర్, ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సతీమణి సావిత్రి బాలసుబ్రహ్మణ్యం ఉన్నారు.


- తిరుమల, ఆంధ్రజ్యోతి

అహ్మదాబాద్ సదస్సుకు తిరుపతి మేయర్



తిరుపతి(జీవకోన), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో బుధ, గురువారాల్లో జరగనున్న మేయర్ల జాతీయ శిఖరాగ్ర సమావేశానికి తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషకు ఆహ్వానం అందింది. ఈ మేరకు అహ్మదాబాద్ నగరపాలక సంస్థ ఆహ్వానం పంపారు. నేషనల్ అర్బన్ కాంక్లేవ్ అండ్ మేయోరల్ సమ్మిట్ ఫర్ షేపింగ్ ఫ్యూచర్ ఆఫ్ సిటీస్ పేరుతో ఈ సమావేశం జరగనుంది. మాజీ ఉపప్రధాని సర్దార్‌వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఈసమావేశం ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్‌లోని ఈ మున్సిపాలిటీకి 1924 నుంచి 1928 వరకు పటేల్ అధ్యక్షుడిగా పనిచేశారు. అందుకే ఈ సమావేశానికి అత్యంత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సమావేశానికి మేయర్ శిరీష వివిధ అంశాలపై ప్రసంగించనున్నారు.

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 5 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.93 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,569

తలనీలాలు సమర్పించినవారు: 27,482

ఈ పరీక్షలు ఇక ఈజీ

- ప్రభుత్వమే సమకూర్చనున్న జవాబు పత్రాలు
- అసెస్‌మెంట్ బుక్‌లెట్లతో విద్యార్థులకు తప్పిన భారం
- ప్రగతి, సామర్థ్యం తెలుసుకునేందుకు అవకాశం

తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక పాఠశాల పరీక్షల నిర్వహణలోనూ వినూత్న విధానానికి శ్రీకారం చుట్టింది. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేలా అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. 1నుంచి 10తరగతుల విద్యార్థులు ఎఫ్ఏ, ఎస్ఏ పరీక్షలను ఇక బుక్‌లెట్లలోనే రాయల్సి ఉంటుంది. ఇప్పటివరకూ ఫార్మేటివ్ అసెస్‌మెంట్, సమ్మెటివ్ అసెస్‌మెంట్ విధానాల్లో పరీక్షలు నిర్వహించేవారు. విద్యార్థులు సొంత ఖర్చుతోనే జవాబు పత్రాలు తెచ్చుకోవాల్సి వచ్చేది. దిద్దిన తర్వాత ఉపాధ్యాయులకు జవాబు పత్రాలను తీసి చూసే పరిస్థితి ఉండేది కాదు. ఈ లోపాలకు చెక్ పెడుతూ ప్రభుత్వం కొత్త పద్ధతిని అమలు చేస్తోంది.



అసెస్‌మెంట్ బుక్‌లెట్ కవర్‌పేజీ - ఓఎంఆర్ షీట్



విద్యార్థులకు ఉపయుక్తం : అసెస్‌మెంట్ బుక్‌లెట్ విధానం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది. విద్యార్థుల ప్రగతి సామర్థ్యాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని అభ్యసనా సామర్థ్యాలను మదింపు చేయడానికి ఉపయోగపడుతుంది. ఓఎంఆర్ షీట్లను అనుసంధానం చేయడంవల్ల విద్యార్థుల సామర్థ్యాన్ని సమగ్రంగా విశ్లేషించేందుకు అవకాశముంటుంది. విద్యార్థులకు ప్రభుత్వమే జవాబు పత్రాలను సమకూర్చడంతో విద్యార్థులకు ఇబ్బంది తప్పింది.

- బి. మురళీకృష్ణ , ఎస్టీయూ జిల్లా సహాధ్యక్షుడు

పరీక్షల్లో వినూత్న విధానం

విద్యాసంవత్సరంలో 4 ఫార్మేటివ్ అసెస్‌మెంట్లు, 2 సమ్మెటివ్ అసెస్‌మెంట్లు ఉంటాయి. ఈ పరీక్షలు రాయడానికి ప్రభుత్వమే 72 పేజీల బుక్‌లెట్ల రూపంలో విద్యార్థులకు జవాబు పత్రాలను సమకూర్చుతోంది. బుక్‌లెట్ విధానం వల్ల మూల్యాంకనం తరువాత జవాబు పత్రాలు మూలన పడేసే పరిస్థితి ఉండదు. ఒక ఎఫ్ఏకి, మరో ఎఫ్ఏకి మధ్య విద్యార్థుల ప్రతిభా సామర్థ్యాల్లో ఎలాంటి మార్పులొచ్చాయో ఉపాధ్యాయులు పరిశీలించే అవకాశం ఉంటుంది. ఏదేని జవాబుకు సున్నా మార్కులు వేసినా, మార్కులు తగ్గించినా కారణాన్ని టీచర్ రాయాల్సి ఉంటుంది. దీంతో విద్యార్థులు పొరపాటును దిద్దుకునే వెసులుబాటు ఉంటుంది. ఇప్పటికే ఒకసారి ఈ పద్ధతి కింద పరీక్షలు రాశారు.

బుక్‌లెట్లు వేర్వేరుగా ఇవ్వాలి



ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్లకు ఒకే అసెస్‌మెంట్ బుక్ ఇచ్చారు. ఇలాకాకుండా వేరువేరు బుక్‌లెట్లుగా ఇవ్వాలి. కాన్ఫరెన్సులు, యాప్‌ల పనిభారంవల్ల మూల్యాంకనం చేసేందుకు సమయం ఉండటంలేదు. ఇప్పటి వరకూ జవాబు పత్రాలను ఇంటికి తీసుకెళ్లి మూల్యాంకనం చేస్తున్నాం. ఇప్పుడు పెద్ద పరిమాణంలో ఉన్న అసెస్‌మెంట్ బుక్స్‌ను తీసుకెళ్లడం ఇబ్బందిగా ఉంది. వేరువేరుగా బుక్‌లెట్లను ఇస్తే కొంత వెసులుబాటుగా ఉంటుంది. వచ్చే ఏడాదినుంచి అలాగే చేస్తామని మంత్రి లోకేష్ మాట ఇచ్చారు.

- శవన్నగారి బాలాజి, ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు

ఆ రోజు మీ వాణి ఏమైంది?

- టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా కల్పిత విమర్శలొద్దు
- నిజానిజాలపై చర్చకు సిద్ధమా?
- భూమనపై ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడి ఆగ్రహం

తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): 'విజయవాడ కనకదుర్గమ్మ ఆలయంలో వెండి సింహాలు మాయం. అంతర్వేదిలో రథాలు దహనం. పిఠాపురంలో దేవాలయాల మీద దాడులు.. దేవతా విగ్రహాలు ధ్వంసం. శ్రీవారికి సీఎం హోదాలో జగన్ సతీసమేతంగా ఏనాడైనా పట్టువస్త్రాలు సమర్పించారా.. డిక్లరేషన్‌పై సంతకం చేశారా.. హిందువుల మనోభావాలు దెబ్బతినేలా నాడు జరిగిన సంఘటనలపై భూమన కరుణాకరెడ్డి వాణి ఏమైంది' అంటూ ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద సరస్వతి నిలదీశారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ, నాస్తికుడైన భూమన హిందూ సమాజానికి ప్రతినిధిగా ప్రచారం చేసుకుంటూ తిరుమలలో ఏదో జరిగిపోతోందని టీటీడీ ప్రతిష్టను దెబ్బతీసేలా కల్పిత విమర్శల చేయడం మానుకోవాలన్నారు. శిల్పి చెక్కి భిన్నమైపోయిన విగ్రహం ఏ దేవతామూర్తిదో తెలియకుండా విష్ణుమూర్తి అంటూ విమర్శలు చేయడం చూస్తుంటే కనీస అవగాహన లేకుండా టీటీడీ ఛైర్మన్‌గా ఎలా పనిచేశావో అంతుపట్టడం లేదన్నారు. టీటీడీ ఛైర్మన్‌గా భక్తుల గురించి పట్టించుకోకుండా అవినీతి, అక్రమాలు తదితర వ్యవహారాలతో తిరుమల కొండను అపవిత్రం చేసినప్పుడు కరుణాకర్‌రెడ్డిలోని సనాతనవాది ఏమయ్యారని ప్రశ్నించారు. తిరుమల కొండపై చేసిన అపవిత్రాలతోనే వైసీపీ 11 సీట్లతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. టీటీడీలో ప్రస్తుతం జరుగుతున్న మంచి కార్యక్రమాలను చూసి ఓర్వలేక పనిగట్టుకుని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. టీటీడీలో నాడు, నేటి పరిస్థితులు, ఆయన చేసిన నిరాధార ఆరోపణలపై చర్చకు రావాలని భూమనకు పిలుపునిచ్చారు. ఇలాంటి ఆరోపణలు మానుకోకపోతే గుణపాఠం చెప్పాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సాధు పరిషత్ సభ్యులు శివానంద స్వామి, గణేష్ స్వామి, ఓంకార్, నీలకంఠ, అరుణ్, మునిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసనంద సరస్వతి

తిరుపతిలో కల్తీ మద్యమని ప్రచారం

- అవన్నీ తప్పుడు వార్తలుగా నిర్ధారించిన అధికారులు
- ఇద్దరు వైసీపీ నేతల అరెస్టు



ఇద్దరు నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కల్తీ మద్యం ఉందని, ప్రజలకు భద్రత ఎక్కడ ఉందంటూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ప్రచారం చేసిన ఇద్దరు వైసీపీ నేతలను ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. అదనపు ఎస్పీ రవి మనోహరాచ్చారి తెలిపిన ప్రకారం.. తిరుపతి వైసీపీ సోషల్ మీడియా సభ్యుడు బ్రుంగి నవీన్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వ్యక్తిగత సహాయకుడు చంద్రశేఖర్ వెంకటేష్ కలిసి ఈ నెల 7న 'ఆట్‌దిరేట్ ఆఫ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ- తిరుపతి' అనే ఇన్‌స్టాగ్రామ్ అకౌంటు ద్వారా 'తిరుపతిలో మద్యం కలకలం.. ప్రజల భద్రత ఎక్కడ' శీర్షికతో వీడియో పోస్టు చేశారు. 11న తిరుపతిలో ఎన్ బ్రాండ్ మద్యం తాగి అపస్మారక స్థితిలో వ్యక్తి అంటూ ఆ పార్టీ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు. ఈ నెల 13న కపిలతీర్థం సర్కిల్ ప్రాంతానికి సంబంధించిన వీడియోలో తిరుపతిలో మద్యం తాగి పడి పోయిన వ్యక్తి అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేశారు. వీటిపై విచారణ చేసిన తిరుపతి అర్బన్ ఎక్సైజ్ సీఐ రామచంద్ర.. అవి తప్పుడు పోస్టులని, ప్రజలను తప్పుదారి పట్టించేవని ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు డీఎస్పీ భక్తవత్సలం పర్యవేక్షణలో ఈస్ట్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐలు హేమాద్రి, నాగార్జున రెడ్డి విచారించారు. సోషల్ మీడియా ద్వారా నిరంతరం తప్పుడు పోస్టులు పెడుతున్నట్లు సీసీ ఫుటేజీలు, వీడియో షేరింగ్ టైమ్, వాట్సాప్ కాల్ రికార్డులు పరిశీలించి కేసు నమోదు చేశారు. ఆ ఇద్దరిని అరెస్టు చేసి న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా, రిమాండు తిరస్కరించారు. 41 నోటీసు ఇచ్చి పంపించారు.

మెడికల్ కాలేజీలపై జగన్ విష ప్రచారం

- 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్



తిరుపతి(కల్చరల్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జగన్ నిర్లక్ష్యం చేసిన వైద్యరంగాన్ని పీపీపీ పద్ధతి ద్వారా అభివృద్ధి చేయాలని కూటమి ప్రభుత్వం సంకల్పిస్తే జగన్ అండ్ కో ఓర్వలేక విషపూరిత ప్రచారాలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ విమర్శించారు. ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ నర్సీపట్నం పర్యటనలో జగన్ తీరుచూస్తే మానసిక స్థితి కోల్పోయినట్లు కనిపిస్తోందన్నారు. రాష్ట్రంలో మెడికల్ కళాశాలలకు కేంద్ర ప్రభుత్వ వాటా తప్ప నాడు జగన్ ప్రభుత్వం రాష్ట్ర వాటాను ఎక్కడా వెచ్చించలేదన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలను నిలిపేసి ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆ మెడికల్ కాలేజీలకు పూర్వవైభవం తీసుకురావాలనే ప్రయత్నాలకు అడ్డుతగులుతూ రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మెడికల్ కాలేజీల విషయంలో కూటమి ప్రభుత్వం గత నిబంధనల మేరకే నడుచుకుంటోందన్నారు. ప్రైవేటు పరం చేస్తున్నారనే మాట వాస్తవం కాదన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాసులు, నాయకులు నరేష్, బీడీ బాలాజీ, ప్రశాంతి, నవీన్, నరేంద్రరెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ల హంగామా

- రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్‌పై దౌర్జన్యం



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అటెండర్‌పై డాక్యుమెంట్ రైటర్ల దౌర్జన్యం

రేణిగుంట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్లు హంగామా సృష్టించారు. కార్యాలయ అటెండర్ తిరుమలేశుపై దౌర్జన్యం చేశారు. లంచం విషయమై సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అటెండర్‌కు, డాక్యుమెంట్ రైటర్ల నడుమ తలెత్తిన వివాదం మంగళవారం మధ్యాహ్నం గందరగోళ పరిస్థితికి దారితీసింది. డాక్యుమెంట్ రైటర్ల జిల్లా అధ్యక్షుడు బుజ్జి ఆధ్వర్యంలో తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంటకు చెందిన డాక్యుమెంట్ రైటర్లు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వద్దకు చేరుకుని అటెండర్ తిరుమలేశుపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ ఆనంద్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సమయంలో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అటెండర్‌పై డాక్యుమెంటు రైటర్లు, వారితోపాటు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు దౌర్జన్యానికి దిగారు. దీంతో కార్యాలయంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఇరువర్గాల నడుమ వాగ్వాదం తారస్థాయికి చేరి ఏం జరుగుతుందో తెలియని గందరగోళ పరిస్థితి చోటుచేసుకుంది. కొంత సేపటికి స్పందించిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ అందరూ బయటకు వెళ్లిపోవాలని చెబుతూనే అటెండర్‌ను నెట్టివేయడం విమర్శలకు దారితీసింది. ఇదిలా ఉండగా క్రయవిక్రయాలకు వచ్చే పార్టీల వద్ద దస్తావేజుల, రిజిస్ట్రేషన్ ఇతర విషయాలు సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతామని తమను కార్యాలయంలోకి రావద్దని, పార్టీలతో లోపల మాట్లాడవద్దని చెప్పడానికి అటెండర్‌కు హక్కు లేదని డాక్యుమెంట్ రైటర్లు చెబుతున్నారు. ఇప్పటికే రెండు రోజులుగా సాగుతున్న ఈ వివాదంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో విధులు స్తంభిస్తున్నాయి. అటెండర్‌పై చర్యలు తీసుకోకపోతే తాము డాక్యుమెంట్లు రూపొందించకుండా షాపులు మూసివేస్తామని రైటర్లు హెచ్చరించారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇక్కడి పరిస్థితులను చక్కబెట్టడానికి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

రేపటి నుంచీ ఎస్వీయూలో యువ తరంగ్-2025



యువ తరంగ్-2025 లోగో

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీలో ఈ నెల 16 నుంచీ యువ తరంగ్-2025 నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని యూనివర్సిటీ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం చేపట్టింది. సంగీత, నృత్య సంబంధమైన సుమారు 30 అంశాల్లో పోటీలు ఉంటాయి. యూనివర్సిటీ అనుబంధ కాలేజీల నుంచీ 40 కళా బృందాలు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. 16వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియంలో యువ తరంగ్-2025 ప్రారంభం కానుంది. శాప్ ఛైర్మెన్ రవినాయుడు, వీసీ నరసింగరావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రారంభిస్తారు. ఈ మేరకు స్టూడెంట్ వెల్ఫేర్ డైరెక్టర్ మురళీధర్, కల్చరల్ అఫైర్స్ కో-ఆర్డినేటర్ పత్తిపాటి వివేక్ తెలిపారు.

కౌశల్ సైన్స్‌క్విజ్ పోటీల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ కేవీఎన్ కుమార్, భానుప్రసాద్ తదితరులు

తిరుపతి(విద్య), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాలని జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ పిలపునిచ్చారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్‌తో ధనుంజయ్‌తో కలిసి మంగళశారం ఆయన తన ఛాంబర్‌లో సైన్స్ క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... భారతీయ విజ్ఞానమండలి, ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్త నిర్వహణలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు ఈ ఏడాది తిరుపతిలో జరుగుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు bvmap.org లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పేర్లను రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 7032889880 సెల్‌ఫోన్ నంబర్‌లో జిల్లా కౌశల్ కోఆర్డినేటర్ డి. ధనంజయులును లేదా 8919387388 సెల్ నంబర్‌లో అడిషనల్ కోఆర్డినేటర్ టి. తులసిని సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో కౌశల్ జిల్లా అడిషనల్ కోఆర్డినేటర్ టి. తులసి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

- రూ.6 లక్షల జరిమానా

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్ గడ్డం రవికి ఐదేళ్ల పాటు జైలు శిక్ష విధిస్తూ రాష్ట్ర ఎర్రచందనం కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. అన్నమయ్య జిల్లా కలకడ మండలం ముడియంవారిపల్లికి చెందిన గడ్డం రవి, కడప జిల్లా రాసపల్లికి చెందిన రాగి మహేష్, శివయ్య, నగేష్, టి.సుండుపల్లికి చెందిన మల్లికార్జున 2018లో శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం మొక్కలు నరికి అక్రమంగా తరలిస్తుండగా ఫారెస్ట్ అధికారులకు పట్టుబడ్డారు.వారి నుంచి9 దుంగలు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా ఈ కేసును రాష్ట్ర స్థాయి ఎర్రచందనం కోర్టు విచారించింది. నిందితుల్లో గడ్డం రవికి ఐదేళ్ళ జైలు శిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మిగిలిన నలుగురిపై సాక్ష్యాధారాలు నిరూపణ కాకపోవడంతో నిర్దోషులుగా ప్రకటించినట్లు లైజన్ అధికారి శ్రీనివాసులు చెప్పారు.

శ్రీసిటీని సందర్శించిన బెల్జియం కాన్సుల్ జనరల్



బెల్జియం కాన్సుల్ జనరల్‌కు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బెల్జియం కాన్సుల్ జనరల్ ఫ్రాంక్ గీర్కెన్స్ అధికారుల బృందంతో బుధవారం శ్రీసిటీలో పర్యటించారు. శ్రీసిటీ ఛైర్మన్ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలను వివరించారు. కాన్సుల్ జనరల్‌తో చర్చల సందర్భంగా పారిశ్రామిక అభివృద్ధి గురించి వివరించిన రవీంద్ర సన్నారెడ్డి 31 దేశాలకు చెందిన 240కి పైగా పరిశ్రమలు ఇక్కడ స్థాపించాయని తెలిపారు. విభిన్న రంగాలలో పెట్టుబడి అవకాశాల కోసం అన్వేషిస్తున్న కంపెనీలకు శ్రీసిటీ అత్యంత విలువైన గమ్యస్థానం అన్నారు. పర్యటనలో భాగంగా కాన్సుల్ జనరల్ శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు. శ్రీసిటీ వసతుల పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ పెట్టుబడిదారులకు ఇది అత్యంత అనువైన ప్రదేశం అని వ్యాఖ్యానించారు. వెర్మీరన్ సంస్థ అధునాతన వీల్ ఛైర్లు తయారు చేయడం ద్వారా బెల్జియం పరిశ్రమలకు శ్రీసిటీలో పునాది వేసిందని ప్రశంశించారు. ప్రపంచ స్థాయి పునరావాస పరికరాల తయారీ సంస్థ వెర్మీరన్ పరిశ్రమ శ్రీసిటీలో ఏర్పాటు కావడం ఆనందంగా ఉందన్న రవీంద్ర సన్నారెడ్డి గ్లోబల్ భాగస్వామ్యాలను ప్రోత్సహించాలనే శ్రీసిటీ నిబద్ధతను ప్రతిబింబిస్తోందని తెలిపారు. అనంతరం వెర్మీరన్ పరిశ్రమను పార్క్ గీర్కెన్స్ సందర్శించి, అక్కడ ఉత్పత్తులు, ఇతర పారిశ్రామిక కార్యకలాపాలను పరిశీలించారు. ఆయనతో పాటు బెల్జియంలోని ఫ్లాండర్స్ రీజియన్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషనర్ జయంత్ నడిగర్ వెర్మీరన్ ఎండీ సయ్యద్ రియాజ్ ఖాద్రీ పాల్గొన్నారు.

విజిలెన్స్ జమేదార్ దురుసుతనం

తిరుచానూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ భక్తురాలిపై ఆలయ మహిళా జమేదార్ చేయి చేసుకున్నారు. వివరాలిలా.. మంగళవారం చెన్నై నుంచి ఆండాల్ అనేహిజ్రా పద్మావతి అమ్మవారి దర్శనానికి వచ్చింది. సన్నిధి వద్ద ఈమెపై మహిళా జమేదార్ దురుసుగా ప్రవర్తించింది. ఈ క్రమంలో వాగ్వాదం పెరగడంతో జమేదార్ భక్తురాలి ముఖంపై చేయి చేసుకుంది. దీంతో ఆమె అక్కడి అధికారులకు ఫిర్యాదుచేసింది. వారు సర్దిచెప్పారు. హుండీ వద్ద కూడా బాధితురాలిపై సదరు జమేదారు మరోసారి దురుసుగా ప్రవర్తించింది. ఆలయం వెలుపల బాధితురాలు విలపించడంతో భక్తులు ఆందోళనకు గురయ్యారు. గతంలో కూడా ఈ జమేదారు ఇదే తరహాలో వ్యవహరించడంతో ఆలయం నుంచి బదిలీ చేశారు. కొన్ని రోజులకే ఓ విజిలెన్సు అధికారి సహకారంతో ఈమె తిరుచానూరులో విధులు నిర్వహిస్తోంది.

తిరుపతిలో కోర్టు కాంప్లెక్సుకు రూ.115.12 కోట్లు మంజూరు

దామినేడు వద్ద 14 ఎకరాల్లో 16 భవనాల నిర్మాణం

తిరుపతి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో కోర్టు భవనాల సముదాయం నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.115.12 కోట్లు మంజూరు చేసింది. తిరుపతి రూరల్ మండలం దామినేడులో కోర్టు భవనాల సముదాయం కోసం ప్రభుత్వం ఇటీవల 14 ఎకరాలు కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం తిరుపతి నగరం వేశాలమ్మ గుడి వీధిలోని కోర్టు కాంప్లెక్సు తక్కువ స్థలంలో ఏర్పాటైంది. అందులో పలు భవనాలు బ్రిటిష్ కాలం నాటివి కావడంతో శిధిలావస్థకు చేరాయి. వాహనాల పార్కింగ్‌కు కూడా స్థలంలేదు. దీంతో కోర్టుల నిర్వహణ ఇబ్బందికరంగా మారింది. ఈ నేపథ్యాన్ని వివరిస్తూ దామినేడులో కొత్తగా కేటాయించిన 14 ఎకరాల్లో నూతన కోర్టు సముదాయం నిర్మించాల్సి ఉంది. దీనికి అవసరమైన నిధులను కేటాయించాలని కోరుతూ హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) ఈ ఏడాది జూలై 5, సెప్టెంబరు 11, 20 తేదీల్లో ప్రభుత్వానికి లేఖలు రాశారు. దీనికి స్పందించిన ప్రభుత్వం సీఎస్ఎస్ పథకం (న్యాయ శాఖకు మౌళిక సదుపాయాల కల్పన) కింద రూ. 115.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో దామినేడులో 16 భవనాలతో కూడిన కోర్టు సముదాయం నిర్మించేందుకు పరిపాలనా ఉత్తర్వులు జారీ చేసింది.

బదిలీ అధికారులకు వీడ్కోలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా జేసీగా పనిచేసి బదిలీపై వెళుతున్న శుభం బన్సల్ సేవలు ఎనలేనివని కలెక్టర్ వెంకటేశ్వర్ కొనియాడారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో పరిశ్రమల డైరెక్టర్‌గా బదిలీపై వెళుతున్న జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ అధికారులిద్దరూ ప్రజలకు ఉత్తమ సేవలు అందించారన్నారు. శుభం బన్సల్ మాట్లాడుతూ శ్రీవారు కొలువై ఉన్న తిరుపతిలో పనిచేసినందుకు సంతోషంగా ఉందన్నారు. డీఆర్వో నరసింహులు మాట్లాడుతూ ఏపీఐఐసీ భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, 22ఏ పెండింగ్ విషయాల్లో జాయింట్ కలెక్టర్ సేవలు మరువలేనివన్నారు. శుభం బన్సల్, రాఘవేంద్రమీనాలను జిల్లా అధికారులు ఘనంగా సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. నగర పాలకసంస్థ కమిషనర్ మౌర్య, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ బదిలీపై వెళుతుండటంతో బాధ్యతలను కలెక్టర్ పర్యవేక్షించనున్నారు.

ఇన్‌సర్వీస్ బీఈడీ అభ్యర్థుల ఎంపిక జాబితా విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ దూరవిద్య ఇన్ సర్వీసు బీఈడీ కోర్సులో సీటు పొందిన అభ్యర్థుల జాబితా విడుదలైంది. బీఈడీ, స్పెషల్ బీఈడీ, బీఈడీ అడిషనల్ మెథడాలజీ కోర్సుల్లో ప్రవేశానికి 2, 500 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 500 మందికి సీట్లు కేటాయించారు. మార్కులు, ఎక్స్‌పీరియన్స్, రోస్టర్‌ను అనుసరించి ఎంపిక చేశారు. సీటు పొందిన వారు రూ. 24, 500 ఫీజును ఆన్‌లైన్ ద్వారా బుధవారం చెల్లించాలని దూరవిద్యా డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ తెలిపారు.

తిరుమలలో సీఐడీ అధికారుల పర్యటన



పంచె, బనియన్‌తో సీఐడీ డీజీ రవిశంకర్, లక్ష్మణరావు

తిరుమల, అక్టోబరు14(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి పరకామణి చోరీ కేసుకు సంబంధించి సీఐడీ అధికారుల బృందం దాదాపు ఏడు గంటల పాటు మంగళవారం తిరుమలలో పర్యటించింది. సోమవారం రాత్రి తిరుమలలోని పోలీస్ గెస్ట్‌హౌస్‌కు సీఐడీ డీజీ రవిశంకర్ అయ్యనార్, సీఐడీ లీగల్ అడ్వైజర్ లక్ష్మణ్ రావు చేరుకున్నారు. స్థానిక సీఐడీ, పోలీసు, విజిలెన్స్ అధికారులతో మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు డీజీ సమీక్షించారు. ఎస్పీ సుబ్బరాయుడు, సీఐడీ డీఎస్పీలు వేణుగోపాల్, కొండయ్య, విజిలెన్స్ వీఎస్వో రామ్‌కుమార్, డీఎస్పీ విజయ్‌శేఖర్‌తో కలిసి పరకామణి కేసు గురించి ఆరా తీశారు. పరకామణిలో లెక్కింపు ఎలా జరుగుతాయి, ఎవరెవరు పాల్గొంటారు, లెక్కింపుల అనంతరం జరిగే డిపాజిట్లు, తనిఖీలు, సీసీ కెమెరాల నిఘా వంటి వివిధ అంశాలపై చర్చించారు. అప్పటి ప్రత్యక్ష సాక్షులతోనూ మాట్లాడారు. తిరుమల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని గంటన్నర పాటు పరకామణి కేసు రికార్డులను పరిశీలించి సీజ్ చేశారు.మధ్యాహ్నం 12.30 గంటలకు ఆలయం వెలుపల ఉన్న నూతన పరకామణికి చేరుకున్నారు. నిబంధనల ప్రకారం డీజీ రవిశంకర్ అయ్యనార్, లీగల్ అడ్వైజర్ లక్ష్మణ్‌రావు పంచె, బనియన్ ధరించి పరకామణిలోకి ప్రవేశించారు. భద్రతా తనిఖీలను వీక్షించారు. కానుకల విభజన, లెక్కింపు, భద్రతపరచడం, తరలించే విధానాలను పరిశీలించారు. కానుకల లెక్కింపు సమయంలో తీసుకునే జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. 1.20 నుంచి 2 గంటల వరకు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాల లైవ్ ఫుటేజ్‌ను పరిశీలించారు.

సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాటం

● పీహెచ్‌సీ వైద్యుల నిరసన



చిత్తూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే వరకు పోరాటాన్ని ఆపేదిలేదని పీహెచ్‌సీ వైద్యులు తేల్చిచెప్పారు. మంగళవారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎన్ని రోజులైనా ధర్నాలు చేస్తూనే ఉంటామని చెప్పారు. వివిధ పీహెచ్‌సీల వైద్యులు పాల్గొన్నారు.

ఆరు మండలాల్లో వర్షం

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గడిచిన 24 గంటల్లో ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లావ్యాప్తంగా ఆరు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. శాంతిపురంలో 18.4 మి.మీ, గుడుపల్లెలో 10.2, కుప్పంలో 8.4, రామకుప్పంలో 2.8, తవణంపల్లెలో 2.2, వి.కోటలో ఒక మి.మీ వర్షపాతం నమోదైంది.

పర్యాటక అభివృద్ధికి అధికారులు కృషి చేయాలి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పర్యాటక అభివృద్ధికి కృషి చేసి జిల్లాను పర్యాటక రంగంలో ముందంజలో ఉంచేలా అధికారులు సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పర్యాటక మండలి కమిటీ సమీక్షా సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ.. కైగల్ జలపాతం, పులిగుండు, కంగుంది, మొగిలి దేవాలయాల్లో తీసుకోవాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఐరాలలోని బుగ్గమడుగు జలపాతం అభివృద్ధిపై డీఎఫ్‌వో సుబ్బరాజుకు సూచనలిచ్చారు. సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులు, పర్యాటక శాఖ ప్రాంతీయ అధికారి రవణప్రసాద్, జిల్లా పర్యాటక అధికారులు నరేంద్రకుమార్, గౌరి, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ చిట్టెమ్మ, బంగారుపాళ్యం టీడీపీ సీనియర్ నాయకుడు ఎన్పీ జయప్రకాష్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంజీవని హెల్త్‌కేర్ ప్రాజెక్టు కోసం ఎస్‌వోపీ : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సంజీవని హెల్త్‌కేర్ ప్రాజెక్టు అమలుకోసం ప్రామాణిక ఆపరేటింగ్ విధానం (ఎస్‌వోపీ)ను కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి వైద్య ఆరోగ్య శాఖ, పంచాయతీరాజ్, సచివాలయ తదితరశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పైలట్ ప్రాజెక్టుగా కుప్పం నియోజకవర్గంలో అమలుచేసిన సంజీవని హెల్త్‌కేర్ ప్రాజెక్టును జిల్లా అంతటికీ విస్తరించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సులభతరంగా అమలు చేసేందుకు గ్రామ, వార్డు సచివాలయ హౌసింగ్ డేటా, ఆరోగ్యశాఖ నుంచి 'అభా' ఐడీ డేటా సేకరించామన్నారు. కలెక్టర్‌వెంట డీఎంహెచ్‌వో సుధారాణి, డీపీఎంవో ప్రవీణ్, వివిధ నియోజకవర్గాల హెల్త్ కేర్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి డాక్టర్లు అనూష, గిరి, హనుమంతరావు, నవీన్‌తేజ్ రాయ్, వెంకటప్రసాద్, అనిల్‌కుమార్, మండలాల నుంచి ఎంపీడీవోలు, వైద్యాధికారులు పాల్గొన్నారు.

రెస్కో డైరెక్టర్లుగా మరో ఇద్దరు



మనోహర్ - చంద్రశేఖర రెడ్డి

రామకుప్పం/వి.కోట, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం విద్యుత్ సహకార సంస్థ(రెస్కో) పాలకవర్గంలో ప్రభుత్వం మరో ఇద్దరికి స్థానం కల్పిస్తూ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. వి.కోట మండలంలోని కొన్ని పంచాయతీలు రెస్కో పరిధిలో ఉండటంతో వి.కోట మండలం చింతలఎల్లాగరానికి చెందిన టీడీపీ నేత చంద్రశేఖర రెడ్డి, రామకుప్పం మండలం ననియాలకు చెందిన బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్ డైరెక్టర్లుగా నియమితులయ్యారు. చంద్రశేఖర రెడ్డి గతంలో కూడా రెస్కో డైరెక్టరుగా ఉన్నారు. అలాగే ఆయన టీడీపీ ఏరియా కమిటీ కన్వీనరుగా పనిచేశారు. మనోహర్ తెలుగు యువత మండలాధ్యక్షుడిగా రెండు దఫాలు ఉన్నారు. ప్రస్తుతం బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగుతున్నారు.

ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయుడిపై దాడి

● ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు ఘర్షణ పడటంతో ఓ విద్యార్థి తండ్రి తన స్నేహితులతో కలిసి ఉపాధ్యాయుడిని చితకబాదారు. బాధితుల కథనం మేరకు... పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షాహిద్(13), అదే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న అనేష్(12) సోమవారం ఘర్షణ పడ్డారు. విద్యార్థి అనేష్ తన ఇద్దరు స్నేహితులతో కలిసి షాహిద్‌ను కొడుతుండగా ఉపాధ్యాయులు అనేష్, షాహిద్‌లను మందలించారు. దీంతో అనేష్ తన తండ్రి జాకీర్‌కు చెప్పడంతో తన కుమారుడిని దండించిన ఉపాధ్యాయుడిపై తన స్నేహితులు సుహెల్, నవాజ్‌తో కలిసి దాడి చేశారు. దాడిలో గాయపడిన ఉపాధ్యాయుడు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ వెంకటరమణ సంఘటన స్థలానికి చేరుకొని దాడికి పాల్పడిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.

20 నుంచి వెబ్‌సైట్ ద్వారా ముక్కంటి అభిషేకం టిక్కెట్లు

శ్రీకాళహస్తి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఈనెల 20వ తేదీ నుంచి పలు అభిషేక టిక్కెట్లు భక్తులు వెబ్‌సైట్‌ద్వారా తీసుకోవాలని ఈవో బాపిరెడ్డి తెలిపారు. భక్తులకు సులభతర దర్శనం కల్పించేందుకు స్వామిఅమ్మవార్ల అభిషేకం, మృత్యుంజయ స్వామి అభిషేకం, రుద్రాభిషేకం, మహాన్యాసపూర్వ అభిషేక టిక్కెట్లను సంబంధిత ఆన్‌లైన్ ద్వారా భక్తులు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న భక్తుల ఆధార్‌కార్డును పరిశీలించి అభిషేకాలను అనుమతిస్తామన్నారు.



కళ్యాణ రేవు జలపాతం




కైగల్ జలపాతం



దుగ్గెమ్మ ఏరు ప్రవహించే గిడుగు జలపాతం

పుష్కలంగా నీరున్నా వినియోగమేదీ?

ప్రాజెక్టులు కట్టక తమిళనాడుకు తరలిపోతున్న జలాలు



తమిళనాడు వైపు తరలిపోతున్న కౌండిన్య నదీజలాలు

పలమనేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు నియోజకవర్గంలో వేలాది ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీరు అందించేందుకు పుష్కలంగా నదీజలాలు అందుబాటులో ఉన్నా వాటిని వినియోగించు కోవడానికి అవసరమైన ప్రాజెక్టుల నిర్మాణం జరక్కపోవ డంతో అవి తమిళనాడుకు తరలిపోతున్నాయి.కౌండిన్య, కైగల్ నదులు, గంగన్న శిరస్సు, దుగ్గెమ్మ ఏటి జలాల వినియోగంలో ప్రభుత్వాలు విఫలం కావడంతో తమిళనా డుకు తరలిపోతున్నాయి.పలమనేరు నియోజకవర్గంలో సాగునీటి లభ్యత అంతంత మాత్రం కావడంతో రైతులు సంప్రదాయ పంటలైన వరి, చెరకు సాగుకు క్రమేపీ స్వస్తి చెబుతున్నారు. ఒకప్పుడు వేలాది ఎకరాల్లో చెరకు సాగు చేసిన రైతులు నేడు ఒక్క ఎకరాలో కూడా సాగుచేయడం లేదు. ఇక వరి సాగు కూడా గతంతో పోలిస్తే 30 శాతానికే పరిమితమైంది.టమోటా, కూరగాయ ల సాగుకే పరిమితమవుతున్నారు.

అటకెక్కిన అనుబంధ రిజర్వాయర్ పనులు

పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల మీదుగా కౌండిన్య నది ప్రవహిస్తోంది.వర్షాకాలంలో మూడు నెలల పాటు ప్రవహించే ఈ నదిపై పలమనేరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చేందుకు దశాబ్దం క్రితం కాలువపల్లె వద్ద జలాశయం నిర్మించారు. అయితే ఈ జలాశయం ఏడాదిపాటు మాత్రమే ప్రజలకు తాగునీరు అందించే సామర్థ్యం కలిగి వుంది.ఏ సంవత్సరమైనా వర్షాలు సరిగ్గా కురవక నది ప్రవహించక పోతే ఆ ఏడాది పొడవునా తాగునీటి ఎద్దడి తప్పదు.పలమనేరు పట్టణ ప్రజలకు తాగునీటి కోసం మున్సిపల్ అధికారులు ట్యాంకర్లు, బోర్లు ద్వారా బొటాబొటిగా సరఫరా చేయాల్సిందే.కౌండిన్య ప్రాజెక్టుకు 5 కిలోమీటర్ల దూరంలోని గంగన్న శిరస్సు జలపాతం వద్ద ఒక రిజర్వాయర్ నిర్మించి, దాంట్లోనుంచి కౌండిన్య రిజార్వాయర్‌కు నీటిని పంపింగ్ చేయడమొక్కటే ఈ సమస్యకు పరిష్కార మార్గమని కొన్నేళ్లుగా నాయకులు చెబుతున్నారు.ఈ ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన భూమిని రైతుల నుంచి సేకరించి ఏళ్ల గడిచిపోతున్నా నిర్మాణ పనులు ఇప్పటికీ మొదలుపెట్టలేదు.

చెక్‌డ్యాంల నిర్మాణం ప్రతిపాదనలకే

పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల్లో భూగర్భ జలాల పెంపుకోసం కౌండిన్య నదిపై చెక్‌డ్యాముల నిర్మాణం మూడు దశాబ్దాల క్రితం ప్రారంభమైంది.సుమారు 20 చోట్ల చెక్ డ్యాముల నిర్మాణం జరిగినా నాణ్యతా లోపాల వల్ల ఇప్పుడు ఒక్క చెక్‌డ్యాంకూడా కనిపించడం లేదు.కాంట్రాక్టర్ల అవినీతికి, అధికారుల పర్యవేక్షణ లోపాలకు అద్దం పడుతూ కూలిపోయిన చెక్‌డ్యాములు కౌండిన్య నది వెంబడి ప్రతి కిలోమీటరుకు దర్శనమిస్తున్నాయి. ఈ చెక్ డ్యాములను సక్రమంగా నిర్మించివుంటే ఈ నదీపరీవాహక ప్రాంతంలోని వందలాది ఎకరాలకు భూగర్భజలాలు వృద్ధి చెంది సాగునీటికి కొరత వుండేది కాదు.దెబ్బతిన్న చెక్‌డ్యాంల స్థానంలో కొత్తవి నిర్మిస్తామంటూ ఏడేళ్లుగా నేతలు చెబుతూనే ఉన్నారు. ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. కాని చెక్‌డ్యాంల నిర్మాణం మాత్రం జరగలేదు.



దుస్థితిలో కౌండిన్య నదిపై కట్టిన చెక్‌డ్యాం

కైగల్ జలాల వినియోగం ఎప్పుడు?

బైరెడ్డిపల్లె మండలంలో కైగల్ నది వర్షాకాలంలో మాత్రమే ప్రవహిస్తుంది.ఈ నదీ జలాలను సద్వినియోగం చేసుకొని రైతులకు సాగునీటిని అందిస్తామంటూ కొన్నేళ్లుగా నేతలు ఎన్నికల వాగ్దానాలు చేస్తున్నా పనులు మాత్రం మొదలవడం లేదు. 2019లో కైగల్ నదిపై ఒక సాగునీటి ప్రాజెక్టు నిర్మాణానికి అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి అమరనాథరెడ్డి శంకుస్థాపన చేశారు. అయితే తర్వాత జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టును పట్టించుకోలేదు.గత ఏడాది జరిగిన ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నియోజకవర్గంలో పర్యటించారు.ఆ సందర్భంగా కైగల్ ప్రాజెక్టు ఆవశ్యకతను ఆయనకు క్షేత్రస్థాయిలో తీసుకువెళ్లి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి వివరించారు. కైగల్ నదిని కూడా మంత్రి పరిశీలించారు. అయితే ఇప్పటివరకూ ఈ ప్రాజెక్టు నిర్మాణంపై ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదు.

దుగ్గెమ్మ ఏరు జలాలను వాడుకోరా?

వి.కోట మండలంలో దుగ్గెమ్మ ఏరు వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ ఏటి జలాలను వి.కోట మండలంలోని వందలాది ఎకరాలకు సాగునీరుగా అందించవచ్చు. ఈ నీటి సద్వినియోగం కోసం ప్రాజెక్టు నిర్మిస్తామని ఎన్నికల సందర్భంగా నాయకులు వాగ్దానాలు చేస్తూనే వున్నారు. అయితే ఈ ప్రాజెక్టుకూడా కేవలం ఎన్నికల వాగ్దానాలకే పరిమితమైపోతోంది.

మామిడి రైతులకు అండగా ప్రభుత్వం



మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మురళీమోహన్, దొరబాబు, సీఆర్ రాజన్

చిత్తూరుసిటీ,అక్టోబర్14(ఆంధ్రజ్యోతి):కూటమి సర్కారు రైతుల అనుకూల ప్రభుత్వమని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు సీఆర్ రాజన్ అన్నారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో వారు మీడియాతో మాట్లాడుతూ మామిడి రైతులు నష్టపోకూడదనే ఉద్దేశంతో సీఎం చంద్రబాబు దేశంలో ఎక్కడా లేనివిధంగా టన్నుకు రూ.4 వేల సబ్సిడీ ఇచ్చారన్నారు.అలాగే మామిడి పల్ప్ యాజమాన్యాలు కూడా టన్నుకు రూ.8 వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు, కలెక్టర్ చొరవతో మామిడి రైతుల కష్టానికి ఫలితం లభించిందన్నారు. జిల్లాలో సుమారు 35 పల్ప్ పరిశ్రమలున్నాయని అందులో వైసీపీకి చెందిన వారివి కూడా ఉన్నాయన్నారు. గుజ్జుపరిశ్రమల యజమానులు, మామిడి కొనుగోలు దారులు సిండికేట్ అవడం వల్ల సీజన్ సుమారు 20 రోజుల ఆలస్యంగా ప్రారంభమైందని అందువల్ల మామిడి రైతులు ఎక్కువగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. పార్టీలకతీతంగా రైతులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. అయితే రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం జిల్లాలో 32 వేల మంది రైతులకు రూ.146 కోట్లు విడుదల చేసి , వారివారి బ్యాంక్ ఖాతాల్లో వేయడంతో రైతులు ఆనందంగా ఉన్నారని చెప్పారు.మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ త్యాగరాజన్, టీడీపీ చిత్తూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, తెలుగు రైతు అధ్యక్షుడు నాగేశ్వర రాజు, వెంకటేష్ యాదవ్, మోహన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

లిక్కర్ స్కాం సొమ్మును ముగ్గురు కూతుళ్లకు పంచిపెట్టారు

మాజీ మంత్రి నారాయణస్వామిపై ఎమ్మెల్యే థామస్ మండిపాటు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): లిక్కర్ స్కాంలో తన వాటా రూ.400 కోట్లను ముగ్గురు కూతుళ్లకు పంచిపెట్టారంటూ మాజీ మంత్రి నారాయణస్వామిపై ఎమ్మెల్యే థామస్ ధ్వజమెత్తారు.మంగళవారం కార్వేటినగరంలో మాల కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, టీడీపీ మండల అధ్యక్షుడు చెంగల్రాయయాదవ్, రుద్రయ్యనాయుడు, స్వామిదాస్‌తో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు.లిక్కర్ స్కాం విచారణకు సిట్ అధికారులు ఇంటికొస్తే నారాయణస్వామి వాళ్ల కాళ్ల మీద పడి అంతా మిథున్‌రెడ్డి అండ్ కో చేశారని, తాను సంతకాలు మాత్రమే చేశానని చెప్పలేదా అని ప్రశ్నించారు.చిత్తూరు డిస్టిలరీకి నారాయణస్వామి లంచం తీసుకున్నారని, శ్రీకాళహస్తి డిస్టిలరీలో నారాయణస్వామికి వాటా ఉన్న విషయం ఎవరికి తెలియదని థామస్ ప్రశ్నించారు.అలాంటిది కృపాలక్ష్మి కూడా ఇప్పుడు నకిలీ మద్యం అంటూ ధర్నాలకు దిగడం హాస్యాస్పదమన్నారు.త్వరలో లిక్కర్ మాజీ మంత్రి నారాయణస్వామి, ఆయన కుమార్తె కృపాలక్ష్మి జైలుకు వెళ్లడం ఖాయమని జోస్యం చెప్పారు. చిత్తూరు జిల్లాలో వైన్‌షాపులు టీడీపీ వాళ్లవే అంటున్నారని, లక్కీ డిప్ ద్వారా ఇస్తే వాటిలో 80 శాతం వైన్ షాపులు వైసీపీ వాళ్లే దక్కించుకున్నారని నారాయణస్వామి మరిచిపోయారా అని ప్రశ్నించారు. జీడీనెల్లూరుకు తాను కంపెనీలను తీసుకొస్తుంటే బురదచల్లే కార్యక్రమాన్ని నారాయణస్వామి, కృపాలక్ష్మి చేపట్టడం దురదృష్టకరమన్నారు.నారాయణస్వామి కంపెనీలు తీసుకొస్తే భూములు తీసిస్తామని థామస్ చెప్పారు. గ్రామాల్లో చిచ్చు పెట్టే పనులు మాని అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే సూచించారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించండి : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే ఔత్సాహికులకు తగు ప్రోత్సాహం ఇచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. జిల్లా పరిశ్రమలకేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది.అధ్యక్షత వహించిన కలెక్టర్ మాట్లాడుతూ గంగాధరనెల్లూరులో పాలీహౌస్ పరిశ్రమ నెలకొల్పడంలో భాగంగా త్వరలో ఓ సమావేశం ఏర్పాటు చేయాలని పరిశ్రమలశాఖ అధికారికి సూచించారు. చిత్తూరు - తచ్చూరు జాతీయ రహదారి సమీపంలో ఉన్న పరిశ్రమలకు దారి ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని నేషనల్ హైవే పీడీని ఆదేశించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం వారికి అవసరమైన నైపుణ్యాల పెంపునకు డీఆర్డీఏ, మెప్మా, ఉద్యాన శాఖ అధికారులంతా సమన్వయంతో నియోజకవర్గాల స్థాయిలో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చేవారికి భూకేటాయింపులు త్వరితగతిన చేస్తామన్నారు. ఇందుకు అవసరమైన అనుమతుల మంజూరులో రెవిన్యూ, అగ్నిమాపక, లేబర్, పొల్యూషన్ కంట్రోల్, చుడా తదితర శాఖలు వేగవంతంగా పని చేయాలన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గతనెలాఖరు వరకు రూ.22 కోట్లతో 1551 సూక్ష్మ, చిన్న పరిశ్రమలు స్థాపించి 6577 మందికి ఉపాధి కల్పించామని డీఐసీ జీఎం సూరిబాబు తెలిపారు. రూ.3663 కోట్ల పెట్టుబడితో 52 భారీ, చిన్న, సూక్ష్మ పరిశ్రమల స్థాపనకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. గత మూడు నెలల్లో పరిశ్రమల స్థాపనకోసం 2290 దరఖాస్తులు రాగా, 2209 మంజూరు చేశామన్నారు.పరిశ్రమల శాఖ జోనల్ మేనేజర్ సుబ్బారావు, ఎల్డీఎం హరీష్, ఉద్యానశాఖ అధికారి మధుసూదన రెడ్డి, స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గుణభూషణ్ రెడ్డి, పారిశ్రామికవేత్త గోవర్ధన బాబి, అధికారులు పాల్గొన్నారు.

నవంబరు 17నుంచి పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలు

తిరుచానూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నవంబరు 17 నుంచి 25వ తేది వరకు నిర్వహించనున్నారు. వచ్చే నెల 11న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 16న అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 17న ధ్వజారోహణం, రాత్రి చిన్న శేషవాహనం, 18న ఉదయం పెద్దశేష వాహనం, రాత్రి హంసవాహనం, 19న ముత్యపుపందిరి, సింహ, 20న కల్పవృక్ష, హనుమంత, 21న పల్లకీ ఉత్సవం, గజవాహనం, 22న సర్వభూపాల, సాయంత్రం స్వర్ణ రథం, రాత్రి గరుడ వాహన సేవ, 23న సూర్యప్రభ, చంద్రప్రభ వాహనం, 24న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహన సేవలు, 25న ఉదయం పంచమీ తీర్థం, రాత్రి ధ్వజావరోహణంలో ఉత్సవాలు ముగియనున్నాయి.

పంటలపై ఆగని గజ దాడులు



ఒంటరి ఏనుగు ధ్వంసం చేసిన కొబ్బరి చెట్టు - రామకృష్ణాపురం వద్ద ఏనుగులు ధ్వంసం చేసిన వరిపంట

కల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు ఆగడంలేదు. మండలంలోని పాళెం పంచాయతీలో సోమవారం రాత్రి పంటలపై ఒంటరి ఏనుగు బీభత్సం సృష్టించింది. దీంతో వరి, కొబ్బరి, మామిడి పంటలకు నష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి సోమవారం రాత్రి సుమారు 8 గంటల సమయంలో బయలుదేరిన ఒంటరి ఏనుగు పాళెం వద్దకు చేరుకుంది. అక్కడ రైతులు శంకర్, అమరనాథ్‌లకు చెందిన వరి, పశుగ్రాసం ధ్వంసం చేసిన ఒంటరి ఏనుగు సచివాలయం-3 వద్దకు చేరుకుంది. కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకున్న ఒంటరి ఏనుగు సురేంద్రనాయుడుకు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరిచేసింది. సమీపంలోని రైతులకు చెందిన కొబ్బరి, మామిడి, అరటిచెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేసింది. అక్కడి నుంచి ఒంటరి ఏనుగు వచ్చిన మార్గంలోనే కల్లూరు-పులిచెర్ల రోడును దాటుకొని జూపల్లి, కోటపల్లి మీదుగా పలువురు రైతుల మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ కల్లూరు ఘాట్‌రోడ్డు వద్దకు చేరుకుంది. అక్కడ బీఎంసీ గోడౌన్ సమీపంలో కర్నూలు-చిత్తూరు హైవేను దాటుకున్న ఒంటరి ఏనుగు పశ్చిమవిభాగం అటవీ ప్రాంతంలోకి చేరుకున్నట్లు ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు.

● **సోమల:** సోమల మండలం ఆవులపల్లె పంచాయతీలో సంచరిస్తున్న ఆరు ఏనుగులు కొత్తూరు కోనమూలలో మకాం వేసి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వీటికి తోడుగా మరో నాలుగు ఏనుగులు మండలంలో ప్రవేశించి ఆవులపల్లె పంచాయతీలోని వంగసానివారిపల్లె, రామకృష్ణాపురం తదితర ప్రాంతంలో సంచరిస్తూ టమోటా, వరి, మామిడి తోటలను చేస్తున్నాయి. మంగళవారం కొత్తూరు సమీపంలోని ఏనుగుల గుంపు గొల్లపల్లె, నల్లరాళ్ల ఉప్పరపల్లె ఫారెస్ట్ వైపు మళ్లినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

కల్వర్టుకు మోక్షం..! గువ్వలగుట్టకు సమకూరిన దారి



చెన్నపట్నం చెరువు మొరవ వద్ద జరుగుతున్న కల్వర్టు పనులు

సోమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం చెన్నపట్నం చెరువు మొరవ పై నిర్మించిన కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలోని గువ్వలగుట్ట కాలనీ వాసులు, రైతులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల జిల్లా కలెక్టరు సుమిత్ కుమార్ చెన్నపట్నం చెరువు మొరవను సందర్శించారు. పీఆర్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించి పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈక్రమంలోనే ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, నీటి సంఘ అధ్యక్షుడు గల్లా బోస్ ప్రత్యేక చొరవ తీసుకుని కల్వర్టు స్థానంలో తాత్కాలికంగా పైపులు మట్టితో దారి సౌకర్యం ఏర్పాటు చేశారు. దీంతో గువ్వలగుట్ట ఎస్టీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లక్కనపల్లె చెరువుకు జలహారతి



పూజలు నిర్వహించడానికి ఊరేగింపుగా వెళుతున్న గ్రామస్తులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మొరవపోతున్న మండలంలోని లక్కనపల్లె చెరువు వద్ద మంగళవారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు, జలహారతి చేపట్టారు. టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రఘుచంద్రగుప్తా ఆధ్వర్యంలో గ్రామస్తులు మేళతాళాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి చెరువు వద్ద జలహారతి ఇచ్చారు. అనంతరం కోలాహలంగా తెప్పోత్సవం నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. పంటలు బాగా పండి ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని గంగమ్మను వేడుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యంశెట్టి, తెలుగు యువత అధ్యక్షుడు భువనచంద్ర గౌడు తదితరులు పాల్గొన్నారు.

సిద్దేశ్వరస్వామి ఆలయానికి రోడ్డు కల్పించాలి



రోడ్డు ఏర్పాటుకు పరిశీలిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలం రెడ్డివారిపల్లె సమీపంలోని సిద్ధేశ్వరస్వామి ఆలయానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డిని కోరారు. స్పందించిన ఆయన మంగళవారం గ్రామానికి చేరుకుని దారి కోసం పరిశీలించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారని.. భక్తులకు సౌకర్యవంతంగా రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జయరామయ్య, నాయకులు ముద్దుకృష్ణ, సుధాకర్‌రెడ్డి, ఆనందరెడ్డి, మధుసూదన్‌నాయుడు, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



విజయోత్సవంలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌బాబు

సోమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధే ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన లక్ష్యమని పుంగనూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక యోగాభిరామాలయంలో ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి వేడుకలు ఘనంగా చేపట్టారు. ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు కవాతు నిర్వహించారు. అనంతరం రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

చెరువుల నిండా నీళ్లు..!

తొలగిపోతున్నాయి కుప్పం కన్నీళ్లు



నీటితో కళకళలాడుతున్న రాజనం చెరువు



నిండిన వీరప్పనాయని చెరువు

కుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కుప్పం నియోజకవర్గ వ్యాప్తంగా చెరువుల్లో పుష్కలంగా నీళ్లు చేరుతున్నాయి. ఏళ్లతరబడి కుదేలు చేసిన కరువు తొలగి, కుప్పం కన్నీళ్లు చెరిగిపోతున్నాయి. స్థానికంగానే కాక, ఎగువ రాష్ట్రమైన కర్ణాటకలో కురుస్తున్న వర్షపు నీరు ఒక్క పక్క, హంద్రీనీవా కాలువ ప్రవాహం మరో పక్క చెరువులను నింపుతూ రైతుల్లో హర్షాన్ని రేకెత్తిస్తోంది.

ముఖ్యమంత్రి చంద్రబాబు భగీరథ ప్రయత్నంతో హంద్రీ-నీవా కాలువ పనులు పూర్తయి కుప్పం తరలివచ్చిన కృష్ణా జలాలు తనతో పాటు రైతులకు అదృష్టాన్ని తీసుకొచ్చింది. హంద్రీనీవా కాలువ ద్వారా కృష్ణా జలాలు రామకుప్పం మండలంలో ప్రవేశించింది మొదలు కుప్పం మండలంలోని పరమసముద్రం చెరువు చేరే వరకు మధ్యలో ఉన్న చాలా వరకు చెరువులు ఒకటొకటిగా నిండుతూ వస్తున్నాయి. శాంతిపురం, గుడుపల్లె మండలాలలో సైతం అర్థభాగం చెరువుల్లో నీళ్లు చేరాయి. హంద్రీ-నీవా కాలువ అంతిమ స్థానమైన కుప్పం మండలంలోని పరసముద్రం చెరువు నిండుగా నీటితో కళకళలాడుతోంది. ఇక్కడి నుంచి నీరు వీరప్పనాయని చెరువుతోపాటు దిగువ చెరువులకు ప్రవహిస్తోంది. కుప్పం పట్టణానికి తాగునీటిని అందించే డీకేపల్లె చెరువు క్రమేణా నీటితో నిండుతోంది. మరోవైపు ఎగువన ఉన్న కర్ణాటక రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసి, వరద నీళ్లు దిగువన ఉన్న కుప్పం నియోజకవర్గంలోని పలు చెరువులకు చేరుతున్నాయి. చేరుతున్న నీటి ప్రవాహం ఎంత ఉధృతంగా ఉన్నదంటే మొరవలు కూడా పారుతున్నాయి. మరోవైపు కుప్పం మండలం కృష్ణదాసనపల్లె పంచాయతీ పరిధిలోని రాజనం చెరువు, బుడ్డోని చెరువు, పుల్లోని చెరువు, పిల్లగాని చెరువు, పెద్ద చెరువు, గాలింటోని చెరువు, కస్యల చెరువు, నంద చెరువు, జోగిండ్లు చెరువు తదితర చెరువులు, కుంటలు నిండుగా నీటితో కళకళలాడుతున్నాయి.

● **రైతుల హర్షాతిరేకం:** హంద్రీ-నీవా కాలువలో ప్రవహిస్తున్న కృష్ణా జలాలు, మరోవైపు ఎగువన ఉన్న కర్ణాటక రాష్ట్రంనుంచి పోటెత్తుతున్న వరద నీటితో నిండుతున్న చెరువులను చూసి రైతుల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి. ఏడెనిమిదేళ్లుగా తీరని కరువుతో అల్లాడిపోతున్న నియోజకవర్గ రైతులు బీళ్లు పెట్టిన పొలాలను దున్నకాలు సాగించి పచ్చటి పంటలు పండించడం మొదలు పెట్టారు. కరువుతో ఎన్నడో విడిచిపెట్టిన వరి సాగును మళ్లీ ప్రారంభించారు. పల్లెపల్లెనా ఎటుచూసినా పచ్చటి పైర్లు కనువిందు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుకు నియోకవర్గ అన్నదాతలు ధన్యవాదాలు చెప్పుకుంటున్నారు. కృష్ణదాసనపల్లె పంచాయతీలోని ప్రతి చెరువు, కుంట నీటితో నిండి మొరవలు పారుతుండటంతో ఆ పంచాయతీ కేంద్రంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మల్లానూరు ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో రైతులు, ప్రజలు సంబరాలు జరుపుకున్నారు.

కుప్పం ప్రజలు రుణపడి ఉంటారు

రాయలసీమ కరువును తీర్చి రతనాల సీమగా చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు హంద్రీ-నీవా కాలువను పూర్తి చేశారు. ఎన్నికల్లో ఇచ్చినమాట ప్రకారం కుప్పం నియోజకవర్గానికి కృష్ణా జలాలు తీసుకొచ్చారు. కుప్పం ప్రాంత పచ్చటి కలలు నిజం చేశారు. కుప్పం ప్రజలు ఎన్నడూ రుణపడి ఉంటారు.

- ప్రేమ్‌కుమార్,
ఏపీఐఐసీ డైరెక్టర్, కుప్పం

గ్రామాల్లో రక్తపరీక్షా శిబిరాలు



రక్తపరీక్షా శిబిరాలను ప్రారంభిస్తున్న అవులకుప్పంలో వెంకటాచలం, లింగాపురంలో రవిరెడ్డి

రామకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంతోపాటు మండలంలోని పలుగ్రామాల్లో మంగళవారం ఉచిత రక్తపరీక్షా శిబిరాలు నిర్వహించారు. ఆవులకుప్పంలో తెలుగు యువత మండల ప్రధాన కార్యదర్శి వెంకటాచలం, లింగాపురంలో క్లస్టర్ ఇన్‌చార్జి రవిరెడ్డి, రామకుప్పంలో పంచాయతీ తెలుగు యువత అధ్యక్షుడు అవినాశ్ రక్తపరీక్షా శిబిరాలను ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో నేతలు భాస్కర్, నాగరాజు, కృష్ణోజీరావు, రఘునాథరావు, బాలాజీ, సుబ్రహ్మణ్యం, కోదండరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మునిరెడ్డి, మోహన్‌బాబు, చంద్రబాబు, అమర్‌నాథ్, చాంద్‌బాషా, నిసార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఆదాయ వనరులపై అవగాహన



జీఎస్టీపై అవగాహన ర్యాలీలో అధికారులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఆదాయ వనరులపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో అప్పాజీ తెలిపారు.మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పుంగనూరు, చౌడేపల్లె, సోమల, సదుం మండలాల పరిధిలోని ఎంపీపీలు, సర్పంచులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2030 నాటికి గ్రామ పంచాయతీల సుస్థిర అభివృద్ధి, పారిశుధ్యం, విద్య, మహిళా సాధికారత, వంద శాతం అక్షరాస్యత, పంచాయతీలకు ఆదాయ వనరుల సేకరణ తదితర అంశాలపై శిక్షణాధికారి ఉదయ్‌కుమార్ అవగాహన కల్పించారు. తగ్గించిన జీఎస్టీ 2.0పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నారాయణ, శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీపీలు, సర్పంచులు పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణ వ్యక్తిగత బాధ్యత



అవగాహన కల్పిస్తున్న ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి

బైరెడ్డిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. పోషకాహార ప్రాముఖ్యత, వ్యక్తిగత శుభ్రత, లింగ వివక్షతతో కలిగే నష్టాలు, ఆరోగ్యకరమైన అలవాట్లు తదితర అంశాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దేశమ్మ, సూపర్‌వైజర్ రెడ్డెమ్మ, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

పుంగనూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మర నత్తం పంచాయతీ కల్లుపల్లెకు చెందిన వినోద్ తన భార్య రేణుక గత మూడు రోజులుగా కనిపించడంలేదని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు.

మామిడి రైతుల ఖాతాలకు రాయితీ నిధులు

పుంగనూరు రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మామిడి రైతుల బ్యాంకు ఖాతాలకు రాయితీ నిధులు జమ చేసినట్లు ఉద్యాన అధికారి వరప్రసాద్ తెలిపారు. పుంగనూరు మండల పరిధిలో 24 మంది రైతులకు సబ్సిడీ విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సోమలకు ఐదుగురు నూతన ఉపాధ్యాయులు



నియామక పత్రాలు అందుకుంటున్న నూతన ఉపాధ్యాయులు

సోమల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీతో పోస్టింగ్ ఆర్డర్లు పొందిన నూతన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లోకి చేరారు. ఈక్రమంలోనే సోమల మండలంలో ఐదుగురు నూతన ఉపాధ్యాయులు ఎంఈవోలు విజయకుమారి, శివరత్నలకు నియామక పత్రాలు అందజేశారు. నూతన ఉపాధ్యాయులు రమేశ్ టీఎం. గొల్లపల్లె, అశోక్‌కుమార్ అన్నెమ్మగారిపల్లె, బిందుమాధవి ముచ్చుకాలువ, సుబ్రహ్మణ్యం నంజంపేట, ప్రవీణ్‌కుమార్ పేటూరు పాఠశాలల్లో విధుల్లో చేరారు. సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సరైన తూకాలతో రేషన్ బియ్యం పంపిణీ చేయాలి



తూనికల యంత్రాలకు సీల్ వేస్తున్న అధికారులు

చౌడేపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్డుదారులకు సరైన తుకాలతోనే డీలర్లు సరఫరా రేషన్ బియ్యం సరఫరా చేయాలని డీటీ రామ్మూర్తి అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తూనికలు, కొలతల అధికారులతో డీలర్ల వద్ద ఉన్న తూనికల యంత్రాలకు మరమ్మతులు నిర్వహించి సీల్ వేశారు. కార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నిర్మూలనకు చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న వైద్యశాఖ గణాంకాల అధికారి జార్జ్

చౌడేపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాలు నివారించడమే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని వైద్యశాఖ జిల్లా గణాంకాల అధికారి జార్జ్ అన్నారు. మంగళవారం ఆయన చారాల విలేజ్ క్లీనిక్‌లో రికార్డులు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, మందుల వివరాలు నమోదు చేయాలన్నారు. అలాగే బాల్య వివాహాల నిర్మూలనపై పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో రామ్మోహన్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ టాలెంట్ టెస్ట్ గోడపత్రికల ఆవిష్కరణ



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

బైరెడ్డిపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థుల్లో సృజనాత్మకతను, సైన్స్‌పై అభిరుచిని పెంపొందించడానికి నిర్వహించే టాలెంట్ టెస్ట్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జేవీవీ మండల కన్వీనర్ శశికుమార్ కోరారు. మండలంలోని కడపనత్తం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇందుకు సంబంధించిన గోడపత్రికను మంగళవారం పాఠశాల హెచ్‌ఎం మాంచాల, ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. 8, 9, 10 తరగతులు చదువుతున్న మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పాఠశాల స్థాయిలో ఈనెల 18న, మండల స్థాయిలో నవంబరు 1న, జిల్లా స్థాయిలో నవంబరు 23న టాలెంట్ టెస్ట్ జరుగుతుందన్నారు. సీఆర్పీ రామచంద్ర, ఉపాధ్యాయులు సురేష్, ప్రసాద్, రేఖ, నాగరాజు పాల్గొన్నారు.

అసంపూర్తిగా వెలుగు భవనం



పెంగరగుంట గ్రామం వద్ద అసంపూర్తిగా ఉన్న వెలుగు భవనం

పలమనేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలం పెంగరగుంట గ్రామం వద్ద వెలుగు స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశాల కోసం మంజూరై అసంపూర్తిగా ఉన్న భవనం నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పెంగరగుంట పంచాయితీలోని స్వయం సహాక సంఘాల మహిళల సమావేశాలు నిర్వహించుకొనేందుకు 2019 లో అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం ఎన్ఆర్‌ఈజీఎస్ పథకం కింద రూ.14 లక్షలు మంజూరు చేసింది. భవననిర్మాణం పూర్తికాకుండానే ఎన్నికల నేపథ్యంలో అప్పుడు మంత్రి పదవిలో ఉన్న ఇప్పటి ఎమ్మెల్యే అమరనాథరెడ్డి 2019 ఫిబ్రవరి 22న వెలుగు భవనానికి ప్రారంభోత్సవం చేసేశారు. అయితే అటుపిమ్మట అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ అసంపూర్తి ఖభవనం గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. భవన నిర్మాణం కాంట్రాక్టు తీసుకొన్న కాంట్రాక్టరు సైతం భవనం ప్రారంభోత్సవం అయిపోయిందని భవన నిర్మాణ పనులను గాలికి వదిలేశారు. గ్రామ పొలిమేరల్లో ఉన్న ఈ వెలుగు భవనం నేడు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. చీకటి పడగానే మందుబాబులు ఈ భవనంలో చేరి మందు తాగడం ఆనవాయితీగా మారిపోయింది. ఇకనైనా ఎమ్మెల్యే, అధికారులు స్పందించి ఈభవన నిర్మాణ పనులు పూర్తిచేయించి ప్రజాధనం దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఆదమరిస్తే ఆస్పత్రికే...!



హంద్రీ-నీవా కాలువపై నిర్మించిన వంతెనపై దుస్థితిలో రోడ్డు

పుంగనూరు రూరల్, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పుంగనూరు- మదనపల్లె మార్గంలోని సుగాలిమిట్ట నుంచి మిట్టచింతలవారిపల్లెకు వెళ్లే మార్గంలో హంద్రీ-నీవా కాల్వపై వంతెన నిర్మించారు. అయితే ఆ వంతెనపై ఏర్పడిన గుంతలు, వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన గోడలు విరిగి పడిపోవడంతో వాహనదారులు ప్రమాదం బారిన పడే అవకాశాలు ఉన్నాయి. అధికారులు చర్యలు తీసుకోవాలని మిట్టచింతలవారిపల్లె, నేతిగుట్లపల్లె ప్రజలు కోరుతున్నారు.

ఒళ్ళు హూనం గ్యారంటీ ..!



దుస్థితిలో ఉన్న పలమనేరు-ఎంపీ కోటూరు రహదారి

పలమనేరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలంలోని మండీపేట కోటూరు రోడ్డు దుస్థితికి చేరుకొని ఏడాది కావవస్తున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామీణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండీపేట నుంచి సముద్రపల్లి మీదుగా పలమనేరుకు వచ్చే ర హదారికి బీటీ రోడ్డు వేసేందుకు గత ప్రభుత్వ హయాంలో కంకర వేసి కాంట్రాక్టరు అలాగే వదిలివేశారు. అప్పటి నుంచి గత రెండేళ్లుగా ఈ రోడ్డుపై వేసిన కంకర లేచిపోయి గుంతలు పడి పాదచారులు ద్విచక్రవాహనదారులు, ఆటోలు వెళ్లేందుకు వీలుకాని విధంగా రోడ్డు దుస్థితికి చేరుకొంది. ఈ మార్గంలో దాదాపు 15 గ్రామాలకు గ్రామీణ ప్రజలు వెళ్లాల్సి వస్తోంది. పలుమార్లు ఈ రోడ్డుకు తారు వేయాలని ప్రజలు ప్రజాప్రతినిధులను కోరుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత మండలంలో పలు రోడ్లు వేసినప్పటికీ ఈ రోడ్డు వేయలేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బీటీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

వీధి కుక్కలతో భయం



సోమలలో గుంపులు గుంపులుగా వీధి కుక్కలు

సోమల, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణంలో వీధి కుక్కల స్వైరవిహారంతో ప్రజలు కుక్కకాటుకు గురయ్యేవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. పట్టణ వీధుల్లో గుంపులుగా చేరి ప్రజలపై దాడి చేస్తుండటంతో జనం భయాందోళన చెందుతున్నారు. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్నారు. గత ఆదివారం సోమల జయంతి కాలనీలో శివయ్యకు చెందిన ఆవును కరిసిగాయాలు చేశాయి. గొర్రెల మందల్లోకి వెళ్లి గాయాలు చేస్తున్నాయి. కుక్కల బెడద నివారణకు పలుమార్లు పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదులు చేసినా ఫలితం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలను బడికి పంపడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారు. సోమల వీధుల్లో గుంపులుగా చేరి ద్విచక్రవాహనాల వెంట పడుతుండటంతో వారు వేగంగా వెళ్లి ఎదురుగా వస్తున్న వాహనాలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి వీధి కుక్కల బెడద నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిండిన తోటకనుమ పటాలమ్మ చెరువు

● కర్ణాటక నుంచి కైగల్‌కు పోటెత్తిన వరద ● పర్యాటకులతో సందడిగా దుముకురాళ్ల జలపాతం



మొరవ పోతున్న తోటకనుమ పటాలమ్మ చెరువు

వి.కోట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు ఇటు వి.కోట, అటు బైరెడ్డిపల్లె మండలాల్లో చెరువులకు జలకళ వచ్చింది. వి.కోట మండల పరిధిలోని కురిసిన వానలకు తోటకనుమ పటాలమ్మ చెరువు పూర్తిస్థాయిలో నిండి పరవళ్లు తొక్కుతోంది. ఎగువనున్న కర్ణాటకలోనూ గత వారం రోజులుగా భారీ వర్షాలు కురవడంతో వరద నీరు దిగువ ప్రాంతమైన కైగల్ వాగుకు భారీగా వచ్చి చేరుతున్నాయి. దీంతో తోటకనుమ పటాలమ్మ చెరువు దిగువకు మొరవ ప్రవహిస్తున్నాయి. అలాగే కైగల్ వాగు నుంచి దిగువనున్న తమిళనాడుకు వృథాగా వరదనీరు ప్రవహిస్తున్నాయి. గత మూడు రోజులుగా కైగల్ దుముకురాళ్ల జలపాతానికి వరద పోటెత్తింది. దీంతో జలపాతంలో ఎటు చూసినా నీటి ప్రవాహం హోరున దిగువకు ప్రవహిస్తున్నాయి. ఈ అందాలను తిలకించేందుకు పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివస్తుండటంతో కైగల్ దుముకురాళ్ల జలపాతం పర్యాటకులతో సందడిగా మారింది. చెరువులకు జలకళ సంతరించుకోవడంతో ఆయకట్టు రైతుల కళ్లల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



దిగువకు పోటెత్తుతున్న కైగల్ జలపాతం

ఆర్తులను ఆదుకుంటాం: థామస్



బాధితులకు చెక్కు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సీఎం సహాయ నిధి ద్వారా ఆర్తులను ఆదుకుంటామని రాష్ట్ర ప్రభుత్వ విప్ థామస్ అన్నారు. మంగళవారం కార్వేటినగరంలో నలుగురు బాధిత కుటుంబీకులకు రూ.8.45 లక్షల చెక్కులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ఏడాదికి వెయ్యి మందికి సీఎం సహాయనిధి అందించడం లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీ మాల వెల్ఫేర్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ యుగంధర్, టీడీపీ మండల అధ్యక్షులు చెంగల్రాయయాదవ్, రుద్రయ్యనాయుడు, స్వామిదాస్, పీఏసీఎస్ చైర్మన్ మాదిరాజు జనార్ధన్‌రాజు, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు నగలపాటి నాగేశ్వరరాజు, నాయకులు మాదిరాజు మురళీకృష్ణ, వి.రాజా, పొద్దుటూరు రాజా, రాజేంద్రరెడ్డి, దాసరి సతీష్, పైడి మనోహర్ నాయుడు, సోమశేఖర్‌యాదవ్, చెంగల్రాయులు, తోటి మురళీమోహన్, సంధాని, జగన్నాథం, రవికుమార్ పాల్గొన్నారు.

నీవానదికి జలహారతి



జలహారతి సమర్పిస్తున్న ఉపాధ్యాయ బృందం

యాదమరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు యాదమరి మండలంలోని చెరువులు పూర్తిగా నిండాయి. కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్ ప్రిన్సిపాల్ ఏపీ లలిత ఆధ్వర్యంలో జొన్నవాళ్లమిట్ట వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న నీవానదికి ఉపాధ్యాయ బృందం హారతి ఇచ్చింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, కనకాచారి, మదన్‌మోహన్‌రెడ్డి, మధుసూదన్, చిట్టిబాబు, అరుణ, కె.భారతి, మంజుల, షర్మిల తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడండి



స్థానికులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుమార్

యాదమరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): సిద్ధారెడ్డిపల్లె గ్రామంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను కాపాడాలని గ్రామస్తులతో కలిసి జనసేన మండల అధ్యక్షుడు కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ పార్థసారథికి వినతిపత్రం సమర్పించారు. సిద్ధారెడ్డిపల్లెలోని భూస్వామి తన రాజకీయ పలుకుబడిని, అర్థబలాన్ని ఉపయోగించి గత ప్రభుత్వ హయాంలో అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాచూరు గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములు, దేవాలయ భూములు, వాగులు, వంకలు, కుంటల భూములతో సుమారు 50 ఎకరాలకుపైగా భూమిని తన ఆధీనంలో ఉంచుకుని, తన కుటుంబ సభ్యుల పేర్ల మీదకు బదలాయింపు చేశారని వివరించారు. దీనిపై తక్షణమే విచారించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ వెంటనే విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు.

వరద బాధితులకు అండగా ఎమ్మెల్యే



బాధితులకు అల్పాహారం అందజేస్తున్న చెన్నకేశవులు నాయుడు

చిత్తూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నీవానది వరద బాధితులకు అండగా ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నిలిచారు. ఎమ్మెల్యే పిలుపుతో ఐదు రోజులుగా నీవానది పరీవాహక ప్రాంత ప్రజలకు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆపన్న హస్తం అందిస్తున్నారు. నదిలో నీటిమట్టం పెరిగినపుడు స్థానికులను అప్రమత్తం చేస్తూ, ఎప్పటికప్పుడు ఇబ్బందులు లేకుండా చూస్తున్నారు. మంగళవారం ఎమ్మెల్యే తండ్రి, జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులు నాయుడు.. వీరభద్ర కాలనీలో పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. వారికి అల్పాహారం అందించారు. నళిని, అనురాధ, సబిత తదితరులు పాల్గొన్నారు.

ఏఐ హబ్‌గా విశాఖ: చుడా చైర్‌పర్సన్

చిత్తూరు సిటీ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏఐ హబ్‌గా విశాఖ మారబోతోందని చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గూగుల్ డేటా సెంటర్ గ్రామీణ స్థాయిలో ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసి విస్తృత సేవలు అందించబోతోందని పేర్కొన్నారు. విశాఖలో డేటా సెంటర్ ఏర్పాటుపై గూగుల్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో సుమారు 1.88 లక్షల ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. సురక్షిత నగరాల్లో ఒకటిగా గుర్తింపు తెచ్చుకున్న గ్రేటర్ విశాఖపట్నం ఇప్పుడు ఐటీ డేటా సిటీ నగరంగా రూపాంతరం కానుందని వివరించారు.

చెరకుకు మద్దతు ధర ప్రకటించాలి



సమావేశంలో ప్రసంగిస్తున్న గోవిందరాజు

నగరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్‌పురం మండలంలోని సాగర్ చక్కెర కర్మాగార యాజమాన్యం చెరకుకు మద్దతు ధర ప్రకటించాలని డీజీఎం గోవిందరాజును నగరి డివిజన్ రైతులు కోరారు. నగరి డివిజన్ కార్యాలయంలో మంగళవారం చెరకు రైతులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. దీపావళి తర్వాత పరిశ్రమను ప్రారంభించే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కానీ రైతులు ఈనెల 24వతేదీ తర్వాత ప్రారంభిస్తే మేలు జరుగుతుందని, లేదంటే ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు. నగరి డివిజన్ ఏవో రవి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

19న చెస్ పోటీలు

చిత్తూరు క్రీడలు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వేపమానువీధిలోని ది స్కూల్ ఆఫ్ చెస్‌లో ఈనెల 19వ తేదీన టౌన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఆంధ్రా చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఆర్‌బీ ప్రసాద్, జిల్లా చెస్ అసోసియేషన్ చైర్మన్ బాబు ప్రసాద్‌రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. అండర్-7, 9, 12, 16 విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు, రిజిస్ట్రేషన్‌కు 90004 75799 నెంబరును సంప్రదించాలని సూచించారు.

నేడు మామిడి రైతుల ఆక్రందన సభ

బంగారుపాళ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతుల ఆక్రందన సభ బుధవారం మాధవనగర్ వద్ద ఉన్న బ్రహ్మానంద ఆశ్రమంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు మామిడి రైతుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు జనార్ధన్, మునీశ్వర్‌రెడ్డి, సురేంద్ర తెలిపారు.

పాత భవనంలో సచివాలయ సిబ్బంది ఇక్కట్లు

పైకప్పు పెచ్చులూడుతుండటంతో భయం.. భయంగా విధులు- మరోవైపు ప్రారంభానికి నోచుకోని కొత్తభవనం





పైకప్పు పెచ్చులూడుతున్న ప్రస్తుత సచివాలయ భవనం - ప్రారంభానికి నోచుకోని కొత్త సచివాలయ భవనం

బంగారుపాళ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గుండ్లకట్టమంచి, చీకూరిపల్లె పంచాయతీలకు సంబంధించి సచివాలయాన్ని చీకూరుపల్లెలోని పాల ఉత్పత్తిదారుల సంఘానికి చెందిన పాత భవనంలో నిర్వహిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఈభవనం ఉరుస్తోంది. పైకప్పు పెచ్చులూడుతోంది. పెచ్చులు ఓకంప్యూటర్‌పైనా పడ్డాయి. దీంతో సిబ్బంది భయం.. భయంగా విధులు నిర్వహిస్తున్నారు. మరుగుదొడ్ల వసతి కూడా లేకపోవడంతో ఉద్యోగినులు, ఇక్కడికొచ్చే మహిళలు ఇబ్బంది పడుతున్నారు. ఇవన్నీ ఇలా ఉంటే ఈసచివాలయానికి కొత్త భవనాన్ని చీకూరిపల్లె పంచాయతీలోని కేజీ సత్రంలో రూ.40లక్షలు వెచ్చించి నిర్మించారు. ఈ భవనం ప్రారంభిస్తే కష్టాలు తీరుతాయని స్థానికులు చెబుతున్నారు.

బాహుదానదిపై శాశ్వత వంతెనల నిర్మాణానికి చర్యలు

- ఎమ్మెల్యే మురళీ మోహన్

తవణంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు బాహుదానదిపై ఇకపై కొట్టుకుపోకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే మురళీ మోహన్ తెలిపారు. తొడతర, అరగొండ, గాజులపల్లె వద్ద కొట్టుకుపోయిన వంతెనలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సాధారణ వర్షాలకే వంతెనలు కొట్టుకుపోతున్నాయని, భారీ వర్షాలు కురిస్తే మండలంలో జనజీవనం పూర్తిగా స్తంభించే ప్రమాదముందన్నారు. అందువల్ల శాశ్వత వంతెనల నిర్మాణానికి చర్యలు చేపట్టామన్నారు. అనంతరం పుంగనూరు నుంచి టమోటా లోడుతో వెళుతున్న వ్యాను తొడతర వద్ద బాహునదిలో బోల్తాపడడంతో గమనించి.. వివరాలు అడిగి తెలుసుకొన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటేష్ చౌదరి, బంగారుపాళ్యం పార్టీ అధ్యక్షుడు ధరణి, బంగారుపాళ్యం ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, కాణిపాకం చైర్మన్ మణి నాయుడు, నాయకులు గాలి దిలీప్, రంజిత్ రెడ్డి, కుమార్ నాయుడు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



అరగొండ వద్ద కొట్టుకుపోయిన వంతెనను పరిశీలిస్తున్న మురళీ మోహన్

రోడ్డుపై పడి దినేష్ గాయపడ్డాడు: డీఎస్పీ



సాయినాథ్

పూతలపట్టు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టుకు చెందిన దినేష్ పూటుగా మద్యం తాగి రోడ్డుపైపడి గాయపడ్డాడని, ఎవరూ గాయపరచలేదని చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ స్పష్టం చేశారు. మంగళవారం పూతలపట్టు పోలీసు స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ద్విచక్రవాహనంలో వచ్చిన దినేష్.. రంగంపేట క్రాస్ వద్ద రోడ్డుపై పడి ఉండగా.. పులిచెర్ల మండలానికి చెందిన మహేష్ బాబు తన స్నేహితులతో కలిసి రెండు కార్లలో చిత్తూరు వైపుగా వెళ్తుండగా గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు దినేష్‌ను అదుపులోకి తీసుకుని డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈనెల 12వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో దినేష్ పోలీసుస్టేషన్‌కు వచ్చి పోలీసుల విధులకు ఆటంకం కలిగించాడు. దీనిపైనా కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఈ విషయంలో సోషల్ మీడియాలో వైరల్ అయిన వీడియో అవాస్తవమని, ఇలాంటివి పోస్టుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

'మద్యం మత్తులో టీడీపీ నాయకులపై అపనిందలు వేశాను'



దినేష్

పూతలపట్టు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో తాను పూతలపట్టు మండలానికి చెందిన టీడీపీ నాయకులపై అపనిందలు వేశానని ఆ పార్టీ కార్యకర్త దినేష్ చెప్పుకొచ్చారు. మంగళవారం పూతలపట్టు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. మద్యంమత్తులో దొరబాబు చౌదరి, యువరాజు నాయుడు, గణపతి నాయుడు పేర్లు ప్రస్తావించడం జరిగిందన్నారు. వాళ్లకు తనకు ఎటువంటి విభేదాలు లేవని చెప్పారు. రాజకీయ లబ్ధికోసం కొంతమంది సోషల్ మీడియా ద్వారా తనను బలిపశువు చేశారని వాపోయాడు. తమ కుటుంబం మొత్తం ఎప్పటికీ టీడీపీలోనే ఉంటుందని స్పష్టం చేశారు.

ఆలత్తూరులో రేషన్ బియ్యం పట్టివేత



బియ్యం బస్తాలను స్వాధీనం చేసుకుంటున్న ఎస్ఐ మల్లికార్జున

నింద్ర, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆలత్తూరులో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని మంగళవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు నింద్ర ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. ముందస్తు సమాచారంతో అసంపూర్తిగా ఉన్న వెలుగు గ్రామ సమాఖ్య భవనంలో తనిఖీ చేయగా 34 బస్తాల రేషన్ బియ్యం గుర్తించారు. బరువు సుమారు 1,680 కిలోలు ఉన్నట్లు తెలిపారు. నిందితులు ఎవరన్నది విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడికి సన్మానం



వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు నగలపాటి నాగేశ్వరాజుకు మంగళవారం కార్వేటినగరంలో టీడీపీ నేతలు సన్మానించారు. వీరిలో.. పీఏసీఎస్ చైర్మన్ మాదిరాజు జనార్ధన్‌రాజు, సీనియర్ నాయకులు మాదిరాజు మురళీకృష్ణ, రుక్కుబాబు ఉన్నారు.

శ్రీరామనామ క్షేత్రంలో మండల పూజ

విజయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురం శ్రీరామనామ క్షేత్రంలో వరసిద్ధి వినాయకుడికి మంగళవారం మండల పూజ నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో అన్నదానం చేశారు. ఆలయ పురోహితుడు రాంప్రసాద్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ చైర్మన్ రామిశెట్టి రాజశేఖర్ పర్యవేక్షించారు.

మామిడి రైతులకు ఇచ్చినమాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు

గంగాధరనెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి రైతులకు టన్నుకు రూ.4వేలను ఇస్తామన్న మాటను ముఖ్యమంత్రి చంద్రబాబు నిలబెట్టుకున్నారని పెనుమూరు ఏఎంసీ చైర్మన్ ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, గంగాధరనెల్లూరు సింగిల్‌విండో సొసైటీ చైర్మన్ ముప్పిరి మోహన్‌నాయుడు తెలిపారు. గంగాధరనెల్లూరులో మంగళవారం సాయంత్రం మీడియాతో మాట్లాడారు. మండలాల వారీగా.. గంగాధరనెల్లూరులో 1445మంది రైతులకు రూ.7.71కోట్లు, కార్వేటినగరంలో 754మంది రైతులకు రూ.3.43కోట్లు, పాలసముద్రంలో 122మంది రైతులకు రూ.57.13 లక్షలు, శ్రీరంగరాజపురంలో 459మంది రైతులకు రూ.2.26కోట్లు, పెనుమూరులో 1242మంది రైతులకు రూ.5.32కోట్లు, వెదురుకుప్పంలో 615మంది రైతులకు రూ.2.89కోట్లు నిధులు విడులయ్యాయని తెలిపారు. ఈ సమావేశంలో టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, మండల అధ్యక్షుడు స్వామిదాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కామసాని కోదండరెడ్డి, నియాజ్‌అలీ, నడింపల్లె దేవరాజులు, టీఎన్‌టీయూసీ పార్లమెంట్ అధికార ప్రతినిధి జీవరత్నం, నేతలు హరీష్‌యాదవ్, పురుషోత్తంనాయుడు, సింగిల్‌విండో డైరెక్టర్ ఇమ్మాన్యేయేల్ పాల్గొన్నారు.

నేడు భారీ బహిరంగ సభ

- సన్నాహక ఏర్పాట్లలో టీడీపీ శ్రేణులు



గుడిపాలలో బ్యానర్లు ఏర్పాటు చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

గుడిపాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వసంతాపురంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదురుగా భారీ బహిరంగ సభ నిర్వహణకు టీడీపీ శ్రేణులు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం 10 గంటలకు సూపర్ సిక్స్ పథకాల విజయోత్సవం, జీఎస్టీ, సింగిల్ విండో పాలకవర్గం, టీడీపీ మండలాధ్యక్షుడి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నారు. ఇందుకోసం భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో జీజేఎం ట్రస్టు ద్వారా రూ.50 లక్షలతో నిర్మించిన ఆడిటోరియం, పాఠశాలలో బోరును ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ కోరారు.

8 లీటర్ల సారా స్వాధీనం: ఒకరి అరెస్టు

వెదురుకుప్పం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వావిలిచేను గ్రామానికి చెందిన తాతిరెడ్డి జగన్నాథరెడ్డి(59) పొలంలో ఎనిమిది లీటర్ల సారా ఉండగా సీజ్ చేశారు. నిందితుడిని అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటసుబ్బయ్య మంగళవారం తెలిపారు.

రోడ్డుపై గొయ్యితో ఇబ్బందులు



కంద్రిగ గ్రామం వద్ద రోడ్డుపై గొయ్యి

గుడిపాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కందగిరికొండకు సమీపంలోని గ్రామమైన కంద్రిగ గ్రామం వద్ద రోడ్డుపై గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో నిత్యం ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు ప్రయాణిస్తుంటాయి. ఏమాత్రం ఆదమరచినా ఈ గొయ్యిలో పడిపోతారు. పైగా ఈ ప్రాంతంలో విద్యుత్ దీపాల్లేక పోవడంతో తరచూ ద్విచక్ర వాహనాలదారులు గాయపడుతున్నారు. ఇది ఇలా ఉండగా ఇదే మార్గంలో నరహరిపేట క్రాస్ నుంచి కమ్మతిమ్మాపల్లె క్రాస్ వరకు రోడ్డుకు ఇరు వైపుల కురుస్తున్న వర్షాలకు దారి కోసుకు పోయింది. దీని కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ సమస్యలన పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

గంగాధరనెల్లూరులో నేడు థామస్ పర్యటన

గంగాధరనెల్లూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వవిప్ డాక్టర్ వి.ఎం. థామస్ గంగాధరనెల్లూరులో బుధవారం రెండు వేర్వేరు కార్యక్రమాల్లో పాల్గొననున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు స్వామిదాస్ తెలిపారు. ఉదయం 10గంటలకు గంగాధరనెల్లూరు అల్లియెల్లమ్మ ఆలయం వద్ద బలిజకండ్రిగ నుంచి బెంగళూరులోని జంబుసవారిదిన్నెకు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రైవేటు బస్సును ప్రారంభించారు. 11 గంటలకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో పోషణ మాసోత్సవ సమావేశంలో పాల్గొనున్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక మంత్రి శరణబసప్ప, మాజీ మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డిలు కాణిపాక వరసిద్ధుడిని మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరిని ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయ మాజీ చైర్మన్లు జగన్నాథరెడ్డి, మోహన్‌రెడ్డి, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు, మాజీ ఎమ్మెల్యేలు లలితాథామస్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పీహెచ్‌సీ వద్ద నిరసన

యాదమరి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పీహెచ్‌సీ ఎదుట సిబ్బంది నిరసన తెలిపారు. పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ 15 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై చేపట్టిన ఆందోళనకు మంగళవారం వీరు మద్దతు తెలిపారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



సిబ్బందితో సమావేశమైన వెంకటప్రసాద్

తవణంపల్లె, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తవణంపల్లె పీహెచ్‌సీని మంగళవారం జిల్లా క్షయ నివారణాధికారి వెంకటప్రసాద్ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సిబ్బంది గోపి, నిర్మ లమ్మ, సుబ్రహ్మణ్యంరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బీఎల్వోలు బాధ్యతగా వ్యవహరించాలి: ఈఆర్వో

బంగారుపాళ్యం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్వోలు) బాధ్యతగా వ్యవహరించి.. ఓటర్ల జాబితాలోని తప్పులను సరిచేయాలని పూతలపట్టు నియోజక వర్గ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ (ఈఆర్వో), డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి చెప్పారు. మంగళవారం తహ ఈల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో సమీక్షించారు. తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు కళ్యాణి, బాబు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

గుడిపాల, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): పానాటూరులో మంగళవారం రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరుకులను మంగళ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వారం డీలర్ పంపిణీ చేశారు. 'బియ్యం వేసేదే ఆలస్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి డిప్యూటీ తహసీల్దార్ వెంకటరామయ్య స్పందించి వీఆర్వో ద్వారా సరుకులు పంపిణీ చేయించారు. ఇలాంటివి పునరావృతమైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

2లక్షల విలువైన సిగరెట్ బాక్సుల చోరీ

చిత్తూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): హోల్‌సేల్ దుకాణ షెట్టర్ తొలగించి.. రూ.2లక్షల సిగరెట్ బాక్సుల చోరీపై రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ నెట్టికంతయ్య తెలిపిన వివరాల మేరకు.. రాఘవరెడ్డివీధిలో రాజేశ్వరి జనరల్ స్టోర్‌ను సుమంత్ ఓ దుకాణాన్ని నడుపుతున్నాడు. ఈనెల 12వతేదీ రాత్రి స్టోర్‌ను మూసేసి, ఇంటికెళ్లాడు. ఆసమయంలో గుర్తు తెలియని వ్యక్తులు దుకాణ షెట్టర్ పగులగొట్టి అందులోని రూ. 2 లక్షల చేసే సిగరెట్ బాక్సులను ఎత్తుకెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దుకాణాల్లో తనిఖీలు



ప్లాస్టిక్ కవర్ల నాణ్యతను పరిశీలిస్తున్న అధికారులు

చిత్తూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరపాలక పరిధిలోని పలు దుకాణాల్లో కమిషనర్ ఆదేశాలతో ప్రజారోగ్య శాఖ అధికారులు మంగళవారం సాయంత్రం తనిఖీలు చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శుల బృందం పొన్నియమ్మన్‌గుడివీధి, రాములగుడివీధి, చర్చివీధి, బజారువీధుల్లో తనిఖీలు చేసింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించరాదని నగరపాలక సంస్థ ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్ హెచ్చరించారు. వివిధ షాపుల్లో 200 కిలోల సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేసి రూ. 26వేల అపరాధ రుసుం విధించినట్లు చెప్పారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ లోకనాథం, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హరికిషన్, అశోక్ పాల్గొన్నారు.